
CHRI 2019

# జైళ్లపై 101 ప్రశ్నలు

## - ఎవరిని అడిగాలో మీకు తెలియదు




CHRI

Commonwealth Human Rights Initiative

working for the *practical* realisation of human rights in the countries of the Commonwealth

# కామన్వెల్త్ మానవ హక్కుల కార్యక్రమం గురించి

కామన్వెల్త్ మానవ హక్కుల కార్యక్రమం (Commonwealth Human Rights Initiative-CHRI) - మానవ హక్కుల రంగంలో పని చేస్తున్న ఒక స్వతంత్ర, లాభాపేక్ష రహిత, నిష్పక్షపాత, అంతర్జాతీయ ప్రభుత్వేతర సంస్థ. తన సభ్య దేశాలు ఉమ్మడిగా పాటించాల్సిన న్యాయ నియమాలకు ఒక ప్రాతిపదికను కామన్వెల్త్ అందించినప్పటికీ, ఈ 53 దేశాలసమితి మానవ హక్కులపై సరిగా దృష్టి పెట్టనందున, కామన్వెల్త్‌లోని పలువృత్తి సంఘాలు 1987 లో CHRI ని స్థాపించాయి.

తన నివేదికలు, నిర్ణీత కాలిక దర్యాప్తుల ద్వారా CHRI, కామన్వెల్త్ దేశాల్లో మానవ హక్కుల పురోగతి, లోటుపాట్లపై అందరి దృష్టి పడేలా చేస్తుంది. మానవ హక్కుల ఉల్లంఘనలను నివారించే పద్ధతులను, చర్యలను సూచించే లక్ష్యంతో CHRI కామన్వెల్త్ సెక్రేటేరియట్‌కు, ఐక్య రాజ్య సమితి మానవ హక్కుల కౌన్సిల్ సభ్యులకు, మీడియాకు ,పౌర సమాజానికి అభ్యర్థనలు పంపుతుంది. ప్రజా చైతన్య కార్యకలాపాలు, విధాన నిర్ణయాలపై చర్చలు, తులనాత్మక పరిశోధన, న్యాయ, సమాచారాల అందుబాటుకు సంబంధించిన అంశాలపై ప్రచారం, నెట్ వర్కింగ్... కేంద్రంగా సహకార స్ఫూర్తితో ఇది పని చేస్తుంది.

యూనివర్సల్ డిక్లేరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్, కామన్వెల్త్ హరారే సూత్రాలు.. తదితర అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన మానవ హక్కుల నియమాలతో పాటు కామన్వెల్త్‌కు అనుగుణమైన మానవహక్కుల హిత దేశీయ నియమాలను సమర్థించి అందరూ వాటికి కట్టుబడి వుండాలని CHRI ప్రబోధిస్తుంది .

న్యూఢిల్లీ ప్రధాన కేంద్రంగా వున్న CHRI కి యూకె (ఇంగ్లండ్) లోని లండన్‌లో, ఘనాలోని అక్రాలోనూ కార్యాలయాలున్నాయి.

ఈ సంస్థ అడ్వైజరీ కమిషన్ చైర్ పర్సన్: యశ్ పాల్ ఘాయ్. ఇందులో సభ్యులు : అలిసన్ డక్స్ బరి, వజాహత్ హబీబుల్లా, వివేక్ మారు ,ఎడ్వర్డ్ మోర్టిమర్, సాం ఒకుడ్జెటో, సంజయ్ హజారికా.

ఎక్జిక్యూటివ్ కమిటీ (ఇండియా) : వజాహత్ హబీబుల్లా, చైర్ పర్సన్.సభ్యులు : బీ.కే. చంద్రశేఖర్, జయంత్ చౌదరి, మజా దారువాలా, నితిన్ దేశాయ్, కమల్ కుమార్, పూనమ్ ముత్రేజా, జాకబ్ పనున్కాన్, వినీతా రాయ్, నిధి రాజ్దాన్, ఏ.పి.షా, సంజయ్ హజారికా.

ఎక్జిక్యూటివ్ కమిటీ (ఘనా): సాం ఒకుడ్జెటో, చైర్ పర్సన్.సభ్యులు : అకోతో అమ్పావ్, యశ్ పాల్ ఘాయ్, వజాహత్ హబీబుల్లా, కోఫీ క్వాశిగా, జూలియట్ తౌక్లి, సంజయ్ హజారికా.

ఎక్జిక్యూటివ్ కమిటీ (ఇంగ్లండ్): జోవాన్నా ఎవార్ట్ జేమ్స్, చైర్ పర్సన్. సభ్యులు : రిచర్డ్ బౌర్న్, ప్రలబ్ బారువా, టోని ఫోర్మన్, నేవిల్లె లింటన్, సుజాన్నే లాంబర్ట్, సంజయ్ హజారికా.


ఇంటర్నేషనల్ డైరెక్టర్ : సంజయ్ హజారికా. ISBN:978-93-81241-65-3. Copyright: 2019. ఈ పుస్తకంలోని విషయాలను, అంశాలను ఎవరైనా ఉపయోగించుకోవచ్చు, కానీ మూలం పేర్కొనాలి.

**CHRI Headquarters, New Delhi**
55A, Third Floor, Siddharth Chambers
Kalu Sarai, New Delhi 110 017, India
Tel: +91 11 4318 0200, Fax: +91 11 2686 4688
E-mail: info@humanrightsinitiative.org

**CHRI London**
Room No. 219, School of Advanced Study
South Block, Senate House, Malet Street
London WC1E 7HU, United Kingdom
E-mail: london@humanrightsinitiative.org

**CHRI Africa, Accra**
House No.9, Samora Machel Street, Asylum Down
Opposite Beverly Hills Hotel
Near Trust Towers, Accra, Ghana
Tel/Fax: +233 302 971170
Email: chriafrica@humanrightsinitiative.org

www.humanrightsinitiative.org




# ఈ పుస్తకం గురించి

అన్ని వేపులా మూసివుంచిన ప్రాంగణాలు జైళ్ళు. ఖైదీల రోజువారి జీవితం,వాళ్ళ దినచర్యల గురించిన సమాచారం మనకు దొరికేది చాలా స్వల్పం. అందులోనూ, జైలు జీవితం గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి గలవారు చాలా తక్కువ–ఒకసారి అందులోకి వెళితే తప్ప. దీనర్థం–కుతూహలం మూలంగా లేదా అవసరం కారణంగా చాలా మందిలో జైళ్ళ గురించి తలెత్తే ప్రశ్నలు సమాధానం లేకుండానే మిగిలి పోయాయి. జైళ్ళ గురించి, ఖైదీల జీవితాల గురించి తరచుగా అడిగే 101 ప్రశ్నలకు సమాధానాలు ఈ చిన్న పుస్తకంలో వున్నాయి.

భారతీయ జైళ్ళు నిర్వహించబడే తీరు, అవి పాటించే నియమ నిబంధనలు వైవిధ్య భరితంగా వుంటాయి. కాబట్టి ఏ ప్రశ్నకూ సరళమైన, సూత్రైన జవాబు దొరకదు, వ్యక్తి ఖైదు చేయబడ్డ రాష్ట్ర కారాగార మాన్యువల్ ఆధారంగానే అంతిమ నిర్ధారణకు రావాలి. అయినా, మౌలిక సూత్రాలు అంతటా ఒక్కటే, ఇది దృష్టిలో ఉంచుకుని ఈ పుస్తకంలో జవాబులివ్వడం జరిగింది. చాలా రాష్ట్రాలలోని జైళ్ళ వ్యవస్థను పరిశీలించిన CHRI విస్తృత అనుభవం ఆధారంగా జవాబులున్నాయి. నియమాలు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఉన్నందున నిర్దిష్ట అంశాలపై పూర్తి అవగాహన కోసం పుస్తకాన్ని జాగ్రత్తగా చదవాలి, సంబంధిత వ్యక్తులను సంప్రదించాలి. ఏవైనా పొరపాట్లు దొర్లితే అవి ఉద్దేశపూర్వకమైనవి కావు. ప్రజలకు అందుబాటులోని సంస్థల నుండి సమాచారం సేకరించాము, మా పరిశోధనలో వివేకం పాటించాము.

# ధన్యవాదాలు



తమతమ పరిజ్ఞానం, అనుభవం, నైపుణ్యాలతో ఈ డాక్యుమెంటు లోని విషయసామగ్రి పరిపుష్టికి తోడ్పడిన వారందరికీ CHRI ధన్యవాదాలు చెబుతున్నది. CHRI కు అప్పటి డైరెక్టర్, ప్రస్తుత సీనియర్ సలహాదారు మజా దారువాలా, పోలీస్ సంస్కరణల కార్యక్రమం మాజీ కో–ఆర్డినేటర్ నవాజ్ కోత్వాల్, జైలు సంస్కరణల కార్యక్రమం మాజీ కో–ఆర్డినేటర్ సానాదాస్ గారల భావన – "101 Things You Wanted to Know About the Police in India but were Afraid to Ask"– ని నమూనాగా తీసుకుని ఈ ప్రచురణ వెలువరించడం జరుగుతోంది.

కొద్ది కాలంగా పక్కన పడేసి వున్న ఈ డాక్యుమెంటు పట్ల శ్రద్ధ తీసుకుని, దీని డిజైను, విషయ సామగ్రి విషయంలో తగు సలహాలిచ్చి ఈ ప్రచురణను ప్రోత్సహించిన సంజయ్ హజారికా, ఇంటర్నేషనల్ డైరెక్టర్, CHRI, గారికి మా ఎనలేని కృతజ్ఞతలు. సంస్థ కమ్యూనికేషన్స్ ఆఫీసర్ రిచా పలు విలువైన సంపాదకీయ అంశాలను అందించారు. ప్రిజన్ రిఫార్మ్స్ ప్రోగ్రాం హెడ్ మధురిమ ధనుకా డాక్యుమెంటులో విస్తృతంగా మార్పులు చేర్పులు చేశారు. వీరికి, ప్రిజన్ రిఫార్మ్స్ ప్రోగ్రాం సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్ సుగంధా శంకర్‌లకు  మా ప్రత్యేక ధన్యవాదాలు. ప్రిజన్ రిఫార్మ్స్ ప్రోగ్రాం మాజీ కన్సల్టంటులైన రుచికా నిగం, జయశ్రీ సూర్య నారాయణ గార్లు ఎంతో ప్రయాసకోర్చి ఈ డ్రాఫ్టును సిద్ధం చేశారు. స్ట్రా టేజిక్ ప్లానింగ్ అండ్ కోలాబరేషన్స్ హెడ్ వినుసంపత్ కుమార్, లండన్ CHRI కి చెందిన సీనియర్ అడ్వోకసి మరియు రీసర్చ్ ఆఫీసర్ రాజా బగ్గా గార్లు ఈ 101 అంశాల సమాహారం  తయారీలో కీలక పాత్ర వహించారు. ప్రిజన్ రిఫార్మ్స్ ప్రోగ్రాంకి చెందిన జట్టు సభ్యులు ఈ డాక్యుమెంటుని సిద్ధం చేయడంలో విలువైన సహకారం అందించారు. ఈ పుస్తకాన్ని తెలుగులోకి అనువదింప జేసేందుకు చాలా శ్రద్ధ తీసుకున్న శ్రీ రాజీవ్ త్రివేది, జైళ్ళ శాఖాధికారి మరియు సంస్కరణల సర్వీసుల సంచాలకులు, తెలంగాణ రాష్ట్రము, హైదరాబాద్, మరియు శ్రీ యం. సంపత్, పర్యవేక్షణాధికారి, కేంద్ర కారాగారము, చెర్లపల్లి గార్లకు ప్రత్యేక కృతజ్ఞతలు. సరళ సుందరంగా అనువదించిన రచయిత ఆడెపు లక్ష్మీపతి గారికి మా ధన్యవాదాలు. సెంథిల్ కుమార్ ఈ చిరు పొత్తం తయారీకి తన సునిశితమైన సృజనాత్మకతను జోడించారు. వీరందరికీ మా హృదయ పూర్వక కృతజ్ఞతలు.

# సాధారణ అంశాలు

### 1. జైళ్ళు అంటే ఏమిటి ?

శిక్ష అనుభవించేందుకు లేదా విచారణ పూర్తయేంత వరకు వేచి ఉండేందుకు వ్యక్తులను నిర్బంధించి ఉంచే స్థలం జైలు. జైళ్ళు రాజ్య నియంత్రణలో వుంటాయి.

### 2. జైళ్ళు పోలీస్ లాకప్ వంటివేనా ?

కాదు. ఈ రెండూ వేరు వేరు. ప్రశ్నిస్తున్నప్పుడు లేదా అరెస్ట్ ప్రొసీడింగ్స్, ఆ తర్వాతి తతంగం జరిగేటప్పుడు అనుమానితులను స్థానిక పోలీసులు తాత్కాలికంగా అదుపులోకి తీసుకుని వుంచడం పోలీస్ లాకప్ .కోర్టు ఉత్తర్వు ద్వారా మాత్రమే ఒక వ్యక్తిని 2 4 గంటలకు మించి పోలీస్ కస్టడీ లో ఉంచాలి .

### 3. ఎవరినైనా జైలుకు పంపవచ్చునా ?

కోర్టు ఉత్తర్వు, దీనినే వారంట్ అంటారు, ద్వారా మాత్రమే ఒక వ్యక్తిని జైలుకు పంపవచ్చు. సరైన కోర్టు ఉత్తర్వు లేనిదే ఎవరినైనా నిర్బంధించి వుంచడం చట్ట విరుద్ధం. 18 ఏళ్ల వయస్సులోపు వారిని – నిందితులైనా, నేరానికి శిక్ష పడ్డ వారైనా– భారత దేశంలోని ఏ జైలు గానీ నిర్బంధించకూడదు.


### 4 .ఏ చట్టం అనుసారం భారత దేశపు జైళ్ళు వ్యవహరిస్తాయి ?

కేంద్ర చట్టం – ప్రిజన్స్ ఆక్ట్ అఫ్ 1894 – అనుసారం మన జైళ్ళు నడుస్తాయి. అయితే జైళ్ళు 7 వ షెడ్యూలు ప్రకారం రాష్ట్రానికి సంబంధించిన అంశం కాబట్టి ఒక్కో రాష్ట్రం తమ సొంత జైలు చట్టాలను, నియమాలను రూపొందించుకున్నాయి. చట్టాల రూపంలో లేదా జైలు మాన్యువల్స్‌లో సూత్రీకరించబడిన ఈ నియమావళి ఖైదీలను ఎలా చూడాలి, ఖైదీలకున్న బాధ్యతలేవి, హక్కులేవి... తదితరాలను తెలియ జేయడంతో పాటు కారాగార యాజమాన్య పద్ధతులను నిర్దేశిస్తుంది. ది ప్రిజనర్స్ (అటెండెన్స్ఇన్ కోర్ట్) ఆక్ట్ 1955, ది ట్రాన్స్ ఫర్ అఫ్ ప్రిజనర్స్ ఆక్ట్ 1950, ది రిపాట్రియేషన్ అఫ్ ప్రిజనర్స్ ఆక్ట్ 2003... జైళ్ళ నిర్వహణను నిర్దేశించే కొన్ని ప్రత్యేక శాసనాలు. భారత రాజ్యాంగం, భారతీయ నేర శిక్షా స్మృతి 1973, భారతీయ శిక్షా స్మృతి 1860... వ్యక్తులను జైలులో నిర్బంధించే విధానాన్ని నిర్దేశిస్తాయి. నిర్బంధంలోకి తీసుకోవడాన్ని అనుమతించే అంశాలు పొందు పరచిన కేంద్ర, రాష్ట్ర చట్టాలు అదనంగా వున్నాయి .

### 5. జైళ్ళ నిర్వహణ ఎవరు చూస్తారు? జైలు శాఖ సంస్థాగత నిర్మాణం ఏమిటి?

జైళ్ళ దైనందిన నిర్వహణ కు పరిపాలక, భద్రత, అనుబంధ సిబ్బందితో కూడిన ఒక జట్టు బాధ్యత వహిస్తుంది. ఒక్కొక్క రాష్ట్రానికి తనదైన సంస్థాగత నిర్మాణం వుంటుంది. సాధారణంగా డైరెక్టర్ జెనరల్ (డీజీ), అడిషనల్ డైరెక్టర్ జెనరల్ (ఏడీజీ) లేదా ఇనస్పెక్టర్ జనరల్ (ఐజీ) రాష్ట్రంలోని జైళ్లకు ముఖ్యాధికారిగా ఉంటాడు. అతడు /ఆమె రాష్ట్ర హోమ్ డిపార్ట్ మెంటుకు నివేదికలిస్తారు.కేంద్ర పాలిత ప్రాంతాల్లో డీజీ /ఐజీ కేంద్ర హోమ్ శాఖకు నివేదిక ఇవ్వాలి. డీజీ / ఏడీజీ /ఐజీ కి దిగువ స్థాయి ర్యాంకు డిప్యూటీ ఇనస్పెక్టర్ జనరల్ (డీఐజీ), ఈ అధికారి అసిస్టెంట్ ఇనస్పెక్టర్ జనరల్ (ఏఐజీ)పై పర్యవేక్షణ చేస్తాడు, అతడు తిరిగి తన కింది అధికారులైన ఒక్కో జైలు సూపరింటెండెంట్‌ను పర్యవేక్షిస్తాడు.

సాధారణంగా సూపరింటెండెంట్ జైలు ముఖ్యాధికారి. ఇతడే జైలు పాలనా సంబంధ వ్యవహారాలకు, ఖైదీల సంక్షేమానికి బాధ్యుడు. ఇతని కింద కార్య నిర్వహణ సిబ్బంది – అడిషనల్ సూపరింటెండెంట్, డిప్యూటి సూపరింటెండెంట్, అసిస్టెంట్ సూపరింటెండెంట్, జైలర్, డిప్యూటి జైలర్, అసిస్టెంట్ జైలర్ వుంటారు. తర్వాతి స్థానంలో జైలు క్యాడర్‌కు చెందిన చీఫ్ హెడ్ వార్డర్, హెడ్ వార్డర్, వార్డ్ /గార్డ్ వుంటారు. దిగువ స్థాయిసిబ్బంది అయిన వార్డర్ /గార్డ్ జైలు లోపల భద్రతకు, క్రమ


PRISON
WANTED
POLICE
VAN

శిక్షణకు బాధ్యుడు, ఇతడు అంతటా కన్నేసి వుంచుతాడు, ఖైదీలను లెక్కిస్తాడు, కారాగారాన్ని తెరుస్తాడు, మూసి తాళం వేస్తాడు, శుభ్రతను పర్యవేక్షిస్తాడు, పనినీ, ఆహారాన్నీ పంచుతూ ఖైదీల బాగోగులు చూస్తాడు. వెల్ఫేర్ ఆఫీసర్లు, ప్రొబేషన్ ఆఫీసర్లు, వొకేషనల్ ట్రైనర్లు, ఫ్యాక్టరీ సూపర్‌వైజర్లు, టీచర్లు, సోషల్ వర్కర్లు, మనస్తత్వ శాస్త్రవేత్తలు, జైలు మెడికల్, పారా మెడికల్ సిబ్బందితో కూడిన వైద్య సిబ్బంది, ఆఫీస్ ఉద్యోగులు... తదితరుల సహాయ సహకారాలు కార్య నిర్వాహక సిబ్బందికి అందుతాయి.

**6. ఇండియన్ ప్రిజన్ సర్వీస్ అనేది ఉందా ?**

లేదు. ఇండియన్ పోలీస్ సర్వీసెస్, ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ ఉన్నట్టుగా మనకు ప్రస్తుతం ఆల్ ఇండియా ప్రిజన్ సర్వీసెస్ లేదు. జైళ్ళ శాఖ అధిపతిని (డీజీ /ఏడీజీ /ఐజీ) ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపిఎస్) నుండి తీసుకోవడం జరుగుతున్నది. సూపరింటెండెంట్లు, అసిస్టెంట్ సూపరింటెండెంట్లు, వార్డర్‌లను రాష్ట్ర ప్రిజన్ సర్వీస్ నుండి తీసుకుంటారు.

**7. జైళ్ళు ఎన్ని రకాలు ?**

వాటి కెపాసిటీ, భద్రత, మౌలిక సదుపాయాలు, మొత్తం సిబ్బంది, ఇతర సౌకర్యాలను బట్టి జైళ్ళు స్థూలంగా 7 రకాలు.

**సెంట్రల్ జైళ్ళు :** శిక్ష అనుభవించే అపరాధులు, విచారణ ఎదుర్కొంటున్న నిందితులు ఇక్కడ ఖైదీలుగా వుంటారు .

**డిస్ట్రిక్ట్ జైళ్ళు :** ఇక్కడ సాధారణంగా విచారణ ఖైదీలుంటారు, శిక్ష పడ్డ ఖైదీలు సెంట్రల్ జైలుకు పంపబడతారు .

**సబ్ – జైళ్ళు :** వీటిలో విచారణ ఖైదీలుంటారు .

**మహిళల జైళ్ళు :** ఇక్కడ మహిళా ఖైదీలే వుంటారు .

**సెమి ఓపెన్ లేదా ఓపెన్ జైళ్ళు :** ఇక్కడ శిక్ష పడ్డ ఖైదీలుంటారు .పని చేయించి వారికో బతుకు దెరువు మార్గం చూపిస్తారు.

**బోర్‌స్టల్ స్కూళ్ళు :** 18–21 ఏళ్ల లోపు నేరస్తులు ఇక్కడ ఖైదీలుగా వుంటారు .

**ప్రత్యేక జైళ్ళు :** రాష్ట్రాలు కొన్ని జైళ్ళను ప్రత్యేక జైళ్లుగా వర్గీకరించవచ్చు. వీటికి నిర్దిష్టమైన ప్రమాణాలు గానీ, నిర్వచనం గానీ లేవు.

**8. ఖైదీలు ఎన్ని రకాలు ?**

వాళ్ళ విచారణ ఏ స్థాయిలో ఉందనే దాన్ని బట్టి ఖైదీలను కింది విధంగా వర్గీకరించ వచ్చు:

**శిక్ష పడ్డ ఖైదీలు :** నేరం నిరూపణ అయి కోర్టు ద్వారా జైలు శిక్ష విధింపబడినవారు.

**విచారణ ఖైదీలు :** కోర్టులో విచారణ పూర్తి కావాల్సి వున్న నిందితులు.

**డిటెన్యూలు :** ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం కింద నిర్బంధంలోకి తీసుకోబడినవారు.

ఇంటర్నీలు/విడుదల కోసం ఎదురు చూస్తున్నవారు : శిక్షా కాలం ముగించుకుని ఇతర కారణాల (ప్రొసీజరల్) మూలంగా విడుదల ఆలస్యమైన వారు.సాధారణంగా విదేశీ ఖైదీల విషయంలో ఇలా జరుగుతుంది .

**సివిల్ ఖైదీలు :** పై వాటిలో దేనికీ చెందని వారు, బాకీ /పన్ను /జరిమానా చెల్లించక పోవడం వంటి ఆర్థిక తప్పిదం కారణంగా ఖైదు చేయబడినవారు.

**9. వివిధ రకాల ఖైదీలకు వేర్వేరు నియమాలున్నాయా ?**

ఔను. ఖైదీల వర్గీకరణను బట్టి ప్రిజన్ మాన్యువల్స్‌లో వివిధ నియమాలు పొందుపరచి వున్నాయి. విచారణ ఖైదీలు, డిటెన్యూలు, సివిల్ ఖైదీల విషయంలో నియమాలు శిక్ష పడ్డ ఖైదీలకున్నంత కఠినంగా వుండవు.



# చేర్చుకునే పద్ధతులు

### 10. కోర్టు ద్వారా ఒక వ్యక్తిని జైలుకు పంపిన తర్వాత ఏమి జరుగుతుంది ?

వ్యక్తిని జైలులో చేర్చుకున్నాక కొన్ని తప్పనిసరి విధివిధానాలు పాటించడం జరుగుతుంది. జైలు ప్రవేశ ద్వారం వద్దే కోర్టు ఉత్తర్వును పరిశీలించి వ్యక్తి గుర్తింపును తనిఖీ చేస్తారు. ఆ పిదప ఆమెను / అతడిని అడ్మిట్, శారీరక తనిఖీ, వైద్య పరీక్ష లు చేసి, ప్రాథమిక అవసర వస్తువులు అందించి, వార్డ్ కేటాయిస్తారు.

### 11. అడ్మిషన్ ప్రక్రియ సమయంలో ఏం జరుగుతుంది ?

కోర్టు ద్వారా ఖైదీలుగా వచ్చిన వారందరినీ లాంచనంగా జైలులో చేర్చుకుంటారు. చేర్చుకునే విధానం ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క రకంగా వుంది. ప్రిజన్ మేనేజ్‌మెంట్ పద్ధతి అమలులో వున్నచోట వ్యక్తి ఫోటోగ్రాఫు, వేలిముద్రలు తీసుకుంటారు. అడ్మిషన్ రిజిస్టర్‌లో అతని /ఆమె వివరాలు నమోదు చేస్తారు. ఖైదీకి తన హిస్టరీ – టికెట్ కాపీ అందిస్తారు లేదా ఇ-కియోస్క్ (అవి వున్న చోట) ద్వారా వివరాలు పొందే మార్గం చెబుతారు. కేసు వివరాలు, కేసు రిఫరెన్స్ నెంబర్, సంబంధిత కోర్టు, ఖైదీ వివరాలు, చిరునామా, హాజరు పరచిన తేదీలు... మొదలైనవి పొందు పరచి వున్నడాక్యుమెంటే హిస్టరీ – టికెట్. ఖైదీ జైలులో ఉన్నంత కాలం ఈ హిస్టరీ టికెట్‌ను మెయింటేన్ చేయాలి. కొన్ని రాష్ట్రాల్లో హిస్టరీ టికెట్‌ను ఖైదీ దగ్గర వుంచుకోనిస్తారు.

### 12. 'ఫిజికల్ సెర్చ్' (శారీరక తనిఖీ) అంటే ఏమిటి ? ఎవరు చేస్తారు ?

అడ్మిషన్ ప్రక్రియ ముగిసినాక, ఏవైనా నిషేధిత వస్తువులు ఉన్నాయేమోనని వ్యక్తిని శారీరకంగా తనిఖీ చేస్తారు. వ్యక్తి గౌరవానికి భంగం కలిగించని రీతిలో ఈ తనిఖీ ప్రక్రియ నిర్వహించాలి. మహిళా ఖైదీలను ఒక చాటు ప్రదేశంలో, వీలయితే వేరే గదిలో, మహిళా సిబ్బంది మాత్రమె చెక్ చేయాలి. నిషేధిత వస్తువుల జాబితా ఒక్కో

రాష్ట్రంలో ఒక్కో విధంగా వుంది, తనిఖీ పద్ధతి కూడా వేరువేరుగా వుంది. దీనిని జైలు డిప్యూటి సూపరింటెండెంట్ లేదా అసిస్టెంట్ సూపరింటెండెంట్ పర్యవేక్షిస్తారు. ఖైదీ దగ్గరి ఆభరణాలు, నగదు వంటి విలువైన వస్తు వివరాలను సంబంధిత రిజిస్టర్‌లో రాసి ఖైదీ సంతకం /వేలి ముద్ర తీసుకోవాలి. ఈ వస్తువుల్ని భద్ర పరచి విడుదల అయ్యే టప్పుడు వ్యక్తికి తిరిగివ్వాలి.

## 13. వైద్య పరీక్ష అంటే ఏమిటి ? అది తప్పనిసరా ?

జైలులో చేర్చుకున్న ప్రతి ఖైదీని 24 గంటలలోగా ఒక మెడికల్ ఆఫీసర్ పరీక్షించాలి. వ్యక్తి వైద్య పరీక్ష వివరాలను-వయసు, బరువు, రోగాల చరిత్ర, అలవాట్లు, శారీరక ఆరోగ్య స్థితి, వాక్సినేషన్ సహా-రికార్డు చేసి ఉంచాలి. ఖైదీ దేహం పైన ఏవైనా దెబ్బలు, గాయాలు కనపడితే, అవి పచ్చిగా ఉన్నట్టయితే, అవి పోలీస్ కస్టడీలో వున్నప్పుడు తగిలినవిగా భావించి మెడికల్ ఆఫీసర్ వాటి గురించి సంబందిత అధికారులకు తెలియజేయాలి. ఖైదీ గర్భవతి అయినా లేదా, కుష్టు లేదా HIV/AIDS వంటి అంటూ వ్యాధులతో బాధ పడుతున్నా - ఆ విషయాలు మెడికల్ రికార్డ్‌లో పొందు పరచాలి. శిక్ష పడ్డ ఖైదీలతో ఎలాంటి శ్రమ చేయించాలో ఈ రికార్డ్ ప్రాతిపదికన నిర్ణయించవచ్చు.

## 14. జైలులో ఎలాంటి ప్రాథమిక వసతులు కల్పించ బడతాయి ?

కొన్ని ప్రాథమిక వసతులు జైలు అధికారులు కల్పిస్తారు. లేదా వసతులు సొంతంగా సమకూర్చు కోవడానికి, లేదా జైలు క్యాంటీన్‌లో లభ్యమైతే కొనుక్కోవడానికి ఖైదీలకు అనుమతి ఇస్తారు. అయితే ఈ విధానం ఒక్కో రాష్ట్రానికి ఒక్కో విధంగా వుంది, సంబంధిత జైలు మాన్యువల్ చూస్తే మొత్తం జాబితా తెలుస్తుంది. మొబైల్స్, రేడియోలు, మ్యూజిక్ ప్లేయర్స్... వంటి ఎలెక్ట్రానిక్ పరికరాలను సాధారణంగా అనుమతించరు. సిగరెట్లు, బీడీలు, పొగాకు, పాన్ మసాలా... మొదలైన వాటికీ అనుమతి లేదు. సాధారణంగా అనుమతించేవి : టూత్ బ్రష్‌లు, టూత్ పేస్ట్, సబ్బు, షాంపూ, టాయిలెట్ పేపర్, సానిటరీ నాప్కిన్స్... తదితర కనీస ఆరోగ్య సాధనాలు, లోదుస్తులు, టవల్, చెప్పులు లేదా స్లిప్పర్స్, పుస్తకాలు, నోటుబుక్కులు, పెన్సిల్స్... వంటి స్టేషనరీ వస్తువులు. విచారణ ఖైదీల విషయంలో నియమాలు సులభ తరంగా వుంటాయి, వాళ్ళను తమ సొంత దుస్తులు వేసుకోనిస్తారు. మెడికల్ ఆఫీసర్ అనుమతితో ఖైదీలు సీల్ /ప్యాక్ చేసిన బ్రాండెడ్ ఔషధాలు సొంత వాడకం కొరకు పెట్టుకోవచ్చు.

## 15. ఖైదీలకు ఏ పద్ధతిన వార్డులు కేటాయిస్తారు ?

ఖైదీలకు వార్డులు కేటాయించే విధానాలు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రకంగానూ, ఒకే రాష్ట్రంలోని వివిధ జైళ్లలో విభిన్నరకాలుగానూ వున్నాయి. వాళ్ళ వాళ్ళ వయస్సు, శారీరక - మానసిక ఆరోగ్య స్థితి, చేసిన నేరం, విచారణ దశ, విచారిస్తున్న కోర్టు, నేరాల రికార్డు, శిక్షా కాలం... ప్రాతిపదికన ఖైదీలను విభజిస్తారు. మామూలుగా అయితే విచారణ ఖైదీలను, శిక్ష అనుభవించే ఖైదీలను, ఆడ, మగ ఖైదీలను వేర్వేరుగా ఉంచుతారు. మొదటి సారి నేరం చేసి వచ్చిన వారిని నేరం చేయడమే అలవాటుగా వున్నవారి నుంచి దూరంగా ఉంచుతారు. ఒక్కొక్క దాంట్లో 20-50 మంది పట్టే బార్కాసుల్లో ఖైదీలను పెడతారు, ఈ బార్కాసుల నిర్మాణ గత కెపాసిటీ ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రకంగా, ఒకే రాష్ట్రంలోని వివిధ జైళ్లలో వివిధ రకాలుగా వుంది.





# జైలు లోపలి జీవితం

**16. ఖైదీలు తమకు కేటాయించిన వార్డులలోనే రోజంతా ఉండాలా ?**

లేదు. ప్రతి జైలులో నిర్దిష్టమైన లాక్-ఇన్, లాక్-అవుట్ సమయాలున్నాయి. మామూలు పరిస్థితుల్లో జైలుని సూర్యాస్తమయం నుండి సూర్యోదయం దాకా లాకప్ చేసి వుంచడం సాధారణం, ఈ సమయంలో ఖైదీలని అటూ ఇటూ తిరగనివ్వరు. పగటి వేళల్లో యార్డులో, వార్డులలో తిరగడానికి, స్నానానికి, వినోద కార్యక్రమాలకీ




నిర్దిష్ట సమయాలున్నాయి. ఒక్కో జైలులో అనుసరించే నియమాన్ని బట్టి దినంలో పలు సార్లు ఖైదీలను లెక్కిస్తారు.

## 17. జైలులో వున్నప్పుడు ఖైదీలు తమతమ మతాచారాలను పాటించే వీలున్నదా?

వున్నది. తన మతాచారాన్ని పాటించే హక్కు ప్రతి ఖైదీకి వుంది. అయితే నిషేధిత వస్తువుల జాబితాలోని 'కిర్పాన్' లాంటివి కలిగివుండే వీలు లేదు. జైలు దైనందిన వ్యవహారాలను లేదా నియమాలను అడ్డుకునే మత పరమైన తంతులకు అనుమతి లేదు. తమ మతవిశ్వాసాలకు అనుగుణంగా ప్రత్యేక స్థలం, ప్రత్యేక ఆహారం కోరుతూ ఖైదీలు జైలు అధికారులను అభ్యర్థించవచ్చు.

## 18. ఖైదీలకు ఎలాంటి ఆహార పదార్థాలు అందిస్తారు ?

రోజుకు మూడు లేదా అయిదు సార్లు ఖైదీలందరికీ ఆహారం ఇస్తారు, ఇందులో టీ, తేలిక తినుబండారాలు, మూడు సార్లు భోజనం వుంటాయి. ఒక డైట్ చార్టుని జైలు ప్రాంగణంలో పెడతారు, లేదా దాని గురించి ఇన్ చార్జ్ ఆఫీసర్ నడిగి తెలుసుకోవచ్చు లేదా జైలు మాన్యువల్‌లో చూడవచ్చు. పప్పు అన్నం లేదా రొట్టె వంటి ప్రధాన, సమతుల భోజనంలో కూరగాయలు – ఒక్కొక్క సారి మాంసం లేదా గుడ్లు వుంటాయి. భోజన పదార్థాలలో ప్రాంతాన్ని లేదా రాష్ట్రాన్ని బట్టి మార్పులుంటాయి. మెడికల్ ఆఫీసర్ సూచనల్ని అనుసరించి కొందరు ఖైదీలకు ప్రత్యేక భోజనం ఇవ్వడం జరుగుతుంది. ఖైదీల ఆరోగ్య స్థితిని, మతవిశ్వాసాలను పరిగణనలోకి తీసుకుని ఒక్కొక్క సారి వారికి వేరే భోజనం కేటాయిస్తారు. జబ్బు పడ్డ వారికి, లేవలేని వారికి, ఆసుపత్రిలో ఉన్నవారికి, గర్భిణీ స్త్రీలకు, పాలిచ్చే తల్లులకు, వారి పిల్లలకూ ప్రత్యేక ఆహారం అందిస్తారు.



## 19. ఖైదీలు బయట నుంచి ఆహారం తెప్పించుకోవచ్చునా ?

విచారణ ఖైదీలు కొన్ని షరతులకు లోబడి సూపరింటెండెంట్ అనుమతితో బయటి నుంచి ఆహారం తెప్పించుకోవచ్చు. కొన్ని జైళ్లలో, అమలులో వున్ననియమ నిబంధనల మేరకు, క్యాంటీన్ల నుంచి ఆహార పదార్థాలు కొనుక్కోవచ్చు. సాధారణంగా క్యాంటీన్‌లలో బిస్కట్లు, నమ్కీన్, బ్రెడ్, వెన్న... తదితర తేలిక పాటి ఆహార పదార్థాలు, సమోసా, కచోడీ ధోల్కా వంటి తిను బండారాలు వుంటాయి. ఆహార పదార్థాల లభ్యత విషయంలో ఒక క్యాంటీన్‌కు మరో క్యాంటీన్‌కు తేడా వుంది.

## 20. జైలు లోపల పరిశుభ్రతకు, పారిశుధ్యానికి ఎవరు బాధ్యులు ?

శుభ్ర పరిచే నిర్ణీత సమయాలు జైలు మాన్యువల్ లో నిర్దేశించి వుంటాయి. జైలు ప్రాంగణంలో పరిశుభ్రతను , పారిశుధ్యాన్నిచూడాల్సిన బాధ్యత జైలు సిబ్బంది పైన, ఖైదీల పైన వుంది. తమ నివాస ప్రదేశాలను శుభ్రంగా ఉంచుకోవడం ఖైదీల బాధ్యత. ఉమ్మడి ప్రాంతాలను శుభ్రపరిచే పని శిక్ష అనుభవిస్తున్న ఖైదీలది (ఆ శ్రమ వారికి విధించబడ్డ శిక్షలో భాగం) లేదా జైలు అధికారులు నియోగించిన స్వీపర్‌లది. స్వీపర్‌లు వార్డులలోని టాయిలెట్‌లను, జైలు లోపలి ఉమ్మడి స్నాన వాటికలను, మరుగు దొడ్లను కూడా శుభ్రం చేస్తారు.

## 21. జైలు లోపల శుభ్రమైన తాగు నీరు లభిస్తుందా ?

ప్రతి ఖైదీకి శుభ్రమైన తాగు నీరు పొందే హక్కు వున్నది. జైళ్ళు వివిధ మార్గాల్లో ఈ వసతి కల్పిస్తాయి. కొన్ని ఫిల్టర్ చేసిన నీటిని, మరి కొన్ని ఆర్‌వో ప్లాంట్ ద్వారా శుద్ధి అయిన నీటిని అందిస్తాయి. కొన్ని  జైలుల్లో తాగు యోగ్యం కాని మామూలు నీరే దొరుకుతుంది. జైలు ఇంచార్జ్‌కి, లీగల్ సర్వీసెస్ అధికారులకు, ప్రముఖ సందర్శకుల మండలి  (Board of Visitors) సభ్యులకు తాగు నీటి నాణ్యత గురించి ఖైదీలు ఫిర్యాదు చేయవచ్చు.

## 22. జైలులో ఎలాంటి ఆరోగ్య సంరక్షణ వసతులు వుంటాయి ?

జైలు ప్రాంగణంలో మెడికల్ ఆఫీసర్లు ఉన్నట్టయితే జబ్బు పడ్డ ఖైదీలు వారికి సమాచారమివ్వవచ్చు. లేదా పేషెంటు మెడికల్ ఆఫీసర్‌ను కలిసేలా జైలు అధికారులు చర్యలు తీసుకోవచ్చు. మెడికల్ ఆఫీసర్ జబ్బు పడ్డ ఖైదీ చికిత్సకు అవసరమైన చర్యలు తీసుకుంటాడు; మందులు రాస్తాడు, రోగ నిర్ధారణ పరీక్షలు సూచిస్తాడు, జైలు ఆసుపత్రిలో చేరేందుకు సలహా ఇస్తాడు. ఖైదీ ఆహారాన్ని, లేదా అతని /ఆమె ఆరోగ్య స్థితిని బట్టి పని షెడ్యూల్ మార్చాల్సిందిగా కూడా సలహా ఇవ్వొచ్చు. పాథాలజికల్ లాబ్ వుంటే జైలులోనే రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారు. జైలు డిపార్ట్‌మెంటు ఖైదీకి ఉచితంగానే మందులు సరఫరా చేస్తుంది.

## 23. వేరే హాస్పిటల్‌లో ట్రీట్‌మెంటుని ఖైదీలు కోరుకోవచ్చునా ?

అవును. ఖైదీలు వేరే ఆసుపత్రులలో ట్రీట్ మెంట్ తీసుకునే వీలువుంది. ఏదైనా స్థానిక హాస్పిటల్‌లో ఖైదీ చికిత్స కోసం మెడికల్ ఆఫీసర్ సిఫార్సు చేయవచ్చు. లేదా తనకు వేరే హాస్పిటల్‌లో చికిత్స కావాలని ఖైదీ, జైలు ఇంచార్జ్ నుంచి అనుమతి కోరవచ్చు. ఇందుకోసం ఖైదీలు తమ కేసు విచారిస్తున్న కోర్టు నుండి అనుమతి కోరుతూ తమ లాయర్ ద్వారా అభ్యర్థన పంపుకోవచ్చు కూడా. ఒక వేళ ఖైదీకి లాయర్ లేనట్టయితే లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీకి నేరుగా లేఖ రాయవచ్చు. పారాలీగల్ వాలంటీర్ లేదా జైలును సందర్శించే ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ లాయర్ సాయం కోరే అవకాశం కూడా ఖైదీకి వుంది.

## 24. మానసిక ఆరోగ్య సంరక్షణకు జైలులో ఎలాంటి వసతులున్నాయి ?

మానసిక రుగ్మతని ముందే గుర్తించడానికి లేదా దాన్ని నివారించడానికి జైలు శాఖ ఖైదీలందరికీ సైకియాట్రిక్, సైకలాజికల్ కౌన్సెలింగ్ ఇప్పించాలి. ఒక సైకాలజిస్ట్, సైకియాట్రీలో శిక్షణ పొందిన ఒక సోషల్ వర్కర్ వెంట వున్న, ఒక క్వాలి ఫైడ్ సైకియాట్రిస్ట్ సేవలను ప్రతి సెంట్రల్, డిస్ట్రిక్ట్ జైలు వినియోగించుకోవాలి. మానసిక రుగ్మతలకు ప్రాథమిక చికిత్స అందించగల వసతులు సెంట్రల్, డిస్ట్రిక్ట్ జైళ్లలో వుండాలి. సబ్ – జైళ్ళు తమ వద్ద వున్న మానసిక రోగ గ్రస్థ ఖైదీలను దగ్గరలోని సైకియాట్రిక్ క్లినిక్‌లకు తరలించాలి, లేదా వాళ్ళను డిస్ట్రిక్ట్ /సెంట్రల్ జైళ్లకు బదిలీ చేయాలి. అన్ని జైళ్ళు ఒక మెంటల్ హాస్పిటల్‌కు అనుబంధంగా వుండాలి. ఇంకా చెప్పాలంటే–మానసిక రుగ్మతలతో బాధపడే ఖైదీలను సరైన చికిత్స కోసం మానసిక ఆరోగ్య కేంద్రాలకు పంపించవచ్చు.

## 25. ఖైదీలు జైళ్లలో పని చేయ వచ్చునా ? అందుకు వేతనాలిస్తారా ?

ఔను, చేయవచ్చు. శిక్ష పడ్డ ఖైదీలు (convict prisoners), ప్రత్యేకించి కఠిన కారాగారావాసం అనుభవిస్తున్న ఖైదీలు జైలులో పని చేయాల్సిందే. జైలు ఇంచార్జ్ ఆఫీసర్ లేదా జైలర్–ఖైదీలకు పని కేటాయిస్తాడు. దీర్ఘ కాలిక శిక్ష అనుభవిస్తున్నవారు, లేదా చదువు కున్నవారు జైలు పాలనా వ్యవహారాల్లో సాయ పడే పనిలో నియోగించబడతారు. స్థానిక పరి భాషలో వారిని కన్విక్ట్ ఆఫీసర్స్ లేదా కన్విక్ట్ వార్డర్స్ అంటారు. ఖైదీలను సాధారణంగా ఫ్యాక్టరీ, తయారీ యూనిట్స్, కిచెన్, క్లీనింగ్, కాపలా, బిల్డింగ్ మరమ్మత్తు పనుల్లో వినియోగిస్తారు. కొందరు ఖైదీలకు లీగల్ సర్వీసెస్ అథారిటీ చేత 'కన్విక్ట్ పారా లీగల్స్' గా శిక్షణ ఇప్పించి వారికి ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లో పని అప్పగించవచ్చు. ఖైదీలను నిపుణులు, అర్థ నిపుణులు, నిపుణరహితులుగా విభజించి ఆ ప్రకారమే వేతనాలు చెల్లిస్తారు. అయితే కనీస వేతనం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన దాని కన్నా తక్కువ ఉండడానికి వీల్లేదు. పనికి రేట్లు

ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కో విధంగా వున్నాయి. విచారణ ఖైదీలకు,సాధారణ జైలు శిక్ష అనుభవిస్తున్న వారికి జైలులో పని చెప్పరు. పని చేయాలా కూడదా అనేది వాళ్ళ ఇష్టం. స్వచ్ఛందం గా ముందుకు వచ్చి పని చేస్తామని అడిగితె – జైలు అధికారులు అందుకు అనుమతించవచ్చు, అనుమతించకపోవచ్చు.

**26. ఖైదీ జైలులో చనిపోతే ఏమి జరుగుతుంది ?**

జైలులో ఖైదీ చనిపోతే అది 'కస్టోడియల్ డెత్ (మ ృతి)'గా పరిగణిస్తారు. కస్టడీ మరణాలను వీరికి తెలియ జేయాలి :


(i) ఎంక్వయిరీ చేపట్టేందుకు వీలుగా – సబ్ సెక్షన్ 4 ఆఫ్ 10 సెక్షన్ 174 మరియు 176 ఆఫ్ ది కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్, 1973 కింద అధికారాలున్న సమీప మేజిస్ట్రేట్‌కు.

(ii) ప్రాథమిక దర్యాప్తు చేయాల్సిన, న్యాయ పరిధిలోని పోలీస్ స్టేషన్ ఇంచార్జ్ ఆఫీసర్‌కు.

(iii) మరణం సంభవించిన 24 గంటలలోగా జాతీయ, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లకు. ఖైదీ మరణించినప్పుడు ఆ మృతికి కారణం కనుగొనేందుకు ఎంక్వయిరీ చేపట్టాలి, అది సహజ మరణమా, అసహజ మరణమా, సత్వర వైద్యం అందించాల్సిన అవసరం ఉండేనా, అది అందినదా, జైలు అధికారులు నిర్లక్ష్యం వహించారా... అన్నది తెలుసు కోవాలి. మృతి గురించి ఖైదీ బంధువులకు వెంటనే సమాచారమందించడం జైలు డిపార్ట్‌మెంటు బాధ్యత.

**27. ఖైదీలకు విధులు, హక్కులు ఉన్నాయా ?**

ఔను, ఉన్నాయి. నిర్బంధం కారణంగా నియంత్రించిన కొన్ని మినహా, భారత రాజ్యాంగం పౌరులకు ప్రసాదించిన అన్ని హక్కులు ఖైదీలకు వర్తిస్తాయి. వారికి విధులు కూడా వున్నాయి. అధికారులు జారీ చేసే చట్టబద్ధ ఉత్తర్వులను పాటిస్తూ, నియమ నిబంధనలకు కట్టుబడి, క్రమ శిక్షణ, శాంతిని కాపాడటం ఖైదీల బాధ్యత. తోటి ఖైదీలను, జైలు సిబ్బందిని, ఇతరుల్ని గౌరవించడం, వారి మతవిశ్వాసాలకు భంగం కలగని రీతిలో ప్రవర్తించడం కూడా ఖైదీలందరి విధి. ప్రభుత్వ సొత్తును ధ్వంసం చేయరాదు. పరిశుభ్రత, పారిశుధ్యానికి సంబంధించి నిర్దేశిత ప్రమాణాలు పాటించడం ఖైదీల బాధ్యత. హక్కులు, విధుల జాబితా కై 36వ పేజి చూడండి.



## కుటుంబ సభ్యులు, స్నేహితులు, లాయర్‌లను కలుసుకోవడం

### 28. జైలులో వున్నఖైదీలను ఎవరెవరు, ఎంత తరచుగా కలుసుకోవచ్చు ?

జైలు నిబంధనల మేరకు ఖైదీలు తమ కుటుంబ సభ్యులను, మిత్రులను, లాయర్‌లను నిర్ణీత వేళల్లో కలుసుకునే అవకాశం వుంది. ఖైదీ శిక్ష అనుభవిస్తున్నవాడా, విచారణ ఎదుర్కొంటున్న వాడా, డిటెన్యూనా, సివిల్ ఖైదీయా – అన్న దాన్ని బట్టి బయటి వాళ్ళ సందర్శనలు వారానికి ఒకసారి లేదా రెండుసార్లు అనుమతించబడతాయి. ఇలా ఖైదీలు తమ వాళ్ళని కలుసుకునే అవకాశాన్ని 'ములాఖత్' (ఇంటర్‌వ్యూ) అంటారు.

### 29. 'ములాఖత్' ఎలా జరుగుతుంది ?

ఈ భేటీ (ములాఖత్) సాధారణంగా అందరూ కలుసుకునే ఉమ్మడి ప్రదేశంలో జరుగుతుంది, ఖైదీలకు, సందర్శకులకు నడుమ అడ్డంగా ఒక వైర్ మెష్ లేదా కటకటాల చట్రం లేదా గాజు పలక వుంటుంది. అమలులో వున్ననిబంధనల ప్రకారం ములాఖత్‌కు 10 లేదా 30 నిమిషాల సమయాన్ని అనుమతిస్తారు. కొన్ని జైళ్లలో ములాఖత్ రోజులను ముందస్తుగా నిర్ణయిస్తారు. కలుసుకునే ముందరే సందర్శకులను జైలు సిబ్బంది చెక్ చేస్తారు. ములాఖత్‌కు ముందు, ఆ తరువాత ఖైదీని (నిషేధిత వస్తువుల కోసం) శారీరక తనిఖీ చేయవచ్చు కూడా.

### 30. సందర్శకులు 'ములాఖత్' కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలి ?

ములాఖత్‌కు సంబంధించి ఒక్కొక్క జైలులో ఒక్కొక్క రకం నిబంధనావళి అమలులో వుంది. కొన్ని జైళ్ళు టెలిఫోన్ లేదా వెబ్ పోర్టల్ ద్వారా అభ్యర్థనల్ని స్వీకరించి సందర్శన దినాల్ని నిర్ణయిస్తాయి, మరికొన్ని జైళ్లలో–సందర్శకులు స్వయంగా జైలు ఆఫీసుకి వెళ్లి సందర్శన ఖరారు చేసుకోవాలి, లేదా క్యూలో నిలబడి ఖైదీని కలుసుకునే అనుమతి దొరికే వరకు వేచి వుండాలి. సందర్శకు లందరూ రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్, వోటర్ కార్డ్... వంటి గుర్తింపు కార్డు తప్పని సరిగా వెంట వుంచుకోవాలి.

**31. ములాఖత్ సమయంలో సందర్శకులు ఖైదీలకు ఆహారం, దుస్తులు, లేదా మందులు ఇవ్వ వచ్చునా ?**

ఔను, ఇవ్వొచ్చు. ఖైదీకి ఇచ్చే ఉద్దేశంతో సందర్శకులు అనుమతించదగ్గ కొన్ని వస్తువులను వెంట తీసుకెళ్లవచ్చు, కానీ ములాఖత్ సమయంలో, భద్రత కారణాల రీత్యా వాటిని నేరుగా ఇవ్వకూడదు. మెయిన్ గేట్ వద్ద ఆ వస్తువుల్ని జైలు సిబ్బందికి అప్పగించాలి–వారు తనిఖీ చేసి తిరిగి ఇచ్చాక లోనికి తీసుకెళ్ళాలి. క్యాంటీన్ సౌకర్యం వున్నజైలులో, ఖైదీ అక్కౌంట్‌లో సందర్శకులు డబ్బు డిపాజిట్ చేస్తే అక్కడ లభించే వస్తువులు కొనుక్కునేందుకు ఖైదీ దాన్ని వినియోగించుకోవచ్చు.

**32. ఖైదీలు ఫోన్ కాల్స్ చేసుకోవచ్చా ? ఆ కాల్స్ ఖర్చు ఎవరు భరిస్తారు ?**

చేసుకోవచ్చు. అయితే ఆ సౌకర్యం వున్న జైలులోనే ఇది వీలవుతుంది. దీన్ని 'ప్రిజన్ ఇంటిమేట్ కాలింగ్ సిస్టం' అంటారు. ముందుగా నమోదు చేసుకున్న రెండు లేదా మూడు నెంబర్‌లకు కాల్స్ చేసుకోవచ్చు. ఖైదీలు తమ కుటుంబం, బంధువులు, మిత్రులు, లాయర్‌లతో మాట్లాడేందుకు కల్పించిన సౌకర్యం ఇది. ఖర్చులు సాధారణంగా ఖైదీయే భరించాల్సి వుంటుంది. ఎంత సేపు మాట్లాడవచ్చుననే విషయమై ఒక్కొక్క జైల్లో ఒక్కొక్క నియమం వుంది.

**33. ఖైదీలు ఉత్తరాలు రాసుకోవచ్చునా ? ఖర్చు ఎవరు భరిస్తారు?**

జైలు నుంచి ఖైదీలు తమ కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు ఉత్తరాలు రాసుకోవచ్చు, బయటి నుంచి ఉత్తరాలు, ఫోటోగ్రాఫులు, డాక్యుమెంటులు అందుకో వచ్చు. అయితే ఇది సెన్సార్‌షిప్‌కు లోబడి వుంటుంది. ఇంచార్జ్ ఆఫీసర్ ముందుగా లేఖలను పరిశీలిస్తాడు, అభ్యంతరకరమైన లేదా మార్మిక సంకేతాలతో (coded) కూడిన అంశాలను తొలగిస్తాడు లేదా లేఖలను ఆపేస్తాడు. కొన్ని జైళ్ళు రాత పరికరాలను, పోస్టేజి స్టాంపుల్ని అందిస్తాయి. సూపరింటేండెంట్ జైలు నియమావళి ననుసరించి ఉత్తర ప్రత్యుత్తరాలు ఎన్ని సార్లు చేయ వచ్చునో నిర్ణయిస్తాడు. కొన్ని జైళ్లలో పోస్ట్ కార్డులు ఉచితంగా ఇస్తారు. మరి కొన్నింటిలో ఖైదీలే ఉత్తరాలు, పోస్టేజి ఖర్చులు పెట్టుకోవాలి.

**34. ఖైదీలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తమ కుటుంబ సభ్యులతో మాట్లాడ వచ్చునా?**

అలాంటి వసతి వున్న జైల్లో ఇంచార్జ్ ఆఫీసర్ అందుకు అనుమతి ఇవ్వొచ్చు – అయితే తన కుటుంబంతో వీడియో కాన్ఫరెన్స్ కావాలని ఖైదీ మనవి చేసుకున్నాకే అది వీలవుతుంది. ఒక వేళ జైలు అధికారులు అందుకు అంగీకరించక పోతే ఖైదీ కోర్టు నుండి అనుమతి కోరవచ్చు. అనుమతి మంజూరయితే వీడియో కాన్ఫరెన్సింగ్ విధి విధానాల గురించి ఖైదీ లేదా అతని తరపు వాళ్ళు జైలు సిబ్బందిని సంప్రదించవచ్చు. e-prisons suite వంటి ప్రిజన్ మేనేజ్ మెంట్ సిస్టమ్స్, వెబ్‌సైట్ ఉపయోగించి ఆన్‌లైన్ ద్వారా అప్పాయింట్‌మెంట్ తీసుకునే సౌకర్యం కల్పిస్తున్నాయి.

**35. వేరే జైలులో నిర్బంధించబడివున్న తన భర్త/భార్యని కలుసుకునేందుకు ఖైదీని అనుమతిస్తారా ?**

అవును. ఖైదీలు ఒకరినొకరు చూసుకునేందుకు జైలు ఇంచార్జ్ ఆఫీసర్ అనుమతిస్తాడు. అయితే ఖైదీ అందు కోసం ముందస్తుగా మనవి చేసుకోవాలి. అదే జైలులో, లేదా వేరే జైలులో బందీగావున్న తన భర్త /భార్యని కలుసుకునే 'ములాఖత్' కి ఆఫీసర్ అనుమతి ఇవ్వవచ్చు .



**36. ఖైదీలు తమ పిల్లలను కలుసుకోవచ్చా ?**

ఖైదీలు తమ పిల్లలను కలుసుకునే వీలుంది. ఆఫీసులోని ఒక గదిలో ఖైదీలు ప్రత్యక్షంగా తమ పిల్లలను కలిసి మాట్లాడే వెసులు బాటు కొన్నిజైళ్ళు కల్పిస్తాయి. ఆరేళ్ళ లోపు పిల్లలు తల్లితో కలిసి జైళ్లోనే ఉండేందుకు అనుమతి వుంది. కొన్ని రాష్ట్రాల్లో పిల్లలు తండ్రితో కలిసి జైల్లో ఉండొచ్చు. పిల్లలు షెల్టర్ హోమ్‌లో ఉన్నట్టయితే– హోమ్, ప్రిజన్ ఇంచార్జ్ ఆఫీసర్‌ల అనుమతులతో ఖైదీలు తమ పిల్లలను వెళ్లి చూడవచ్చు.

**37. ఖైదీల కుటుంబాలు దూర ప్రాంతాల్లో ఉన్నట్టయితే, కుటుంబ సభ్యులను కలుసుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలేమిటి ?**

అలాంటి పరిస్థితుల్లో, తనను తన స్వగ్రామానికి సమీపంలోని జైలుకు బదిలీ చేయాల్సిందిగా ఖైదీ విన్నపం చేసుకోవచ్చు. భద్రత, ఖైదీ ఆరోగ్య స్థితి, పరిపాలనా సౌలభ్యం కోణంలో పరిశీలించి ఒక నిర్ణయం తీసుకోగల ఇంచార్జ్ ఆఫీసర్ కి ఖైదీ ముందుగా దరఖాస్తు పెట్టుకోవాలి. దీనికి మరో ప్రత్యామ్నాయమేమిటంటే – వీడియో కాన్ఫరెన్సింగ్ లేదా టెలిఫోన్ ద్వారా కుటుంబ సభ్యులతో అప్పుడప్పుడు మాట్లాడించడం.

**38. లాయర్‌లు జైలులో వున్నతమ క్లయింట్లను కలుసుకోవచ్చునా ? వారి సందర్శనకు కూడా పై విధానమే వర్తిస్తుందా ?**

తమ క్లయింట్లను కలవడం లాయర్‌ల విధి. లాయర్ల సందర్శనకు కొన్ని నియమాలు మాత్రమే వున్నాయి, లాయర్లతో ఖైదీల భేటీకి కొన్ని జైళ్ళు ప్రత్యేక స్థలాలు లేదా గదులు అందుబాటులో ఉంచుతాయి. జైలు ఇంచార్జ్ ఆఫీసర్ ను సంప్రదించి లాయర్‌లు తమ సందర్శన తేదీలను, సమయాలను ఖరారు చేసుకోవచ్చు.



# వినోద సౌకర్యాలు, ఇతర వసతులు

### 39. జైలులో పుస్తకాలు, వార్తాపత్రికలు చదవడానికి ఖైదీలను అనుమతిస్తారా?

జైలు ఇంచార్జ్ ఆఫీసర్ అనుమతితో ఖైదీ తన వద్ద పుస్తకాలు ఉంచుకోవచ్చు. చదువుకోవడానికి జైలు లైబ్రరీ నుండి పుస్తకాలు, పత్రికలు తీసుకోవచ్చు.

### 40. సంగీతం వినడం, ఇతర మనోరంజక కార్యక్రమాల్లో పాల్గొనడం... వంటివి ఖైదీలు చేయ వచ్చునా ?

వినోదానికి సంబంధించి సౌకర్యాలు ఒక్కొక్క జైలులో ఒక్కొక్క రకంగా వున్నాయి. నిర్ణీత సమయాల్లో వినేందుకు, వీక్షించేందుకు బార్రాకుల్లో అందరి కోసం రేడియో లేదా టెలివిజన్ ఉంచే ఏర్పాటు కొన్ని జైళ్లలోవుంది. వాళ్ళ వాళ్ళ అభిరుచి, సామర్థ్యాన్ని బట్టి ఖైదీలలోంచే వాద్య బృందాలు లేదా థియేటర్ గ్రూపులు తయారు కావడాన్ని కొన్ని జైళ్ళు అనుమతిస్తాయి. ఫుట్‌బాల్, క్రికెట్, వాలీబాల్.. తదితర ఆటలు, క్యారమ్స్ వంటి ఇండోర్ గేమ్స్ ఆడుకోవడానికి కొన్ని జైళ్లలో అనుమతి వుంది.

### 41. ఖైదీలు తమ విద్యా స్థాయుల్నిపెంచుకునే అవకాశం ఉందా ?


వుంది. జైలులో వుండగా ఖైదీలు తమ చదువులను కొనసాగించవచ్చు, కొత్త కోర్సులలో చేరవచ్చు. వారు పరీక్షలకు హాజరు కావడాన్ని అధికారులు అనుమతిస్తారు. ఏదైనా కోర్సులో చేరిన ఖైదీలు తమ బంధు మిత్రుల నుండి పుస్తకాలు, రాత పరికరాలు అందుకోవచ్చు. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వమే పుస్తకాలు ఇస్తుంది లేదా ఖైదీలే స్వయంగా కొనుక్కోవాల్సి వుంటుంది. ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (IGNOU), వయోజన అక్షరాస్యత కార్యక్రమం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రోగ్రాములు, కంప్యూటర్ సెంటర్‌లలో ఐటి కోర్సులు సైతం కొన్ని జైళ్ళు నిర్వహిస్తాయి. విద్యా కోర్సుల్లో చేరడానికి అనుమతి కోసం ఖైదీలు జైలు అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి.

### 42. జైలులో వున్న ఖైదీలు బ్యాంక్ ఖాతా తెరవ వచ్చునా ?

బ్యాంక్ ఖాతా తెరవడానికి ఖైదీలను అనుమతిస్తారు. ఖైదీలందరికీ బ్యాంక్ ఖాతా తెరిచే ఆనవాయితీ కొన్ని రాష్ట్రాల్లో వుంది. వాళ్ళ వేతనాలు డిపాజిట్ చేసేందుకు, క్యాంటీన్ (అవి వున్నచోట) ల నుండి వాళ్ళు వస్తువులు కొనుక్కునెందుకూ ఆ ఖాతాలు ఉపయోగపడతాయి.

### 43. జైలులో బందీగా వున్నఖైదీలు వోటు వేయ వచ్చునా ?

శిక్ష పడని ఖైదీలు (unsentenced prisoners) గా జైలులో వున్నప్పుడు వోటు వేయడానికి వీల్లేదు, కానీ ఎన్నికలలో పోటీ చేయవచ్చు.



# న్యాయ పరమైన సహాయం అందుబాటు

### 44. ఖైదీలకు లాయర్ ను పెట్టుకునే హక్కు ఉందా ?

తన తరపున లాయర్‌ను పెట్టుకునే హక్కు  ప్రతి వ్యక్తికి వుంది. అరెస్ట్ అయిన క్షణం నుంచి ఆ హక్కు వర్తిస్తుంది. ఇంటరాగేషన్ సమయంలో లాయర్ పక్కనే ఉంటాడు, బెయిల్ దరఖాస్తు పెట్టమనీ, తన డిఫెన్సుకు సిద్ధం కమ్మనీ ఖైదీ అతణ్ణి ఆదేశించ వచ్చు. జైలులో వున్నతన క్లయింటును లాయర్ కలవాల్సి వుంటుంది. కేసు ఏ దశలో వుందో వివరించి, డిఫెన్స్ వాదనకు సిద్ధం అయేందుకు క్లయింట్‌తో మాట్లాడాల్సి వుంటుంది.

### 45. లాయర్‌ను పెట్టుకునే స్తోమత ఖైదీకి లేనప్పుడు ఏమవుతుంది ?

సెక్షన్ 12 (g) ఆఫ్ ది లీగల్ సర్వీసెస్ అథారిటీ అక్ట్ 1987 ప్రకారం–రాజ్యం ఉచితంగా అందించే లీగల్ ఎయిడ్ సర్వీసెస్‌కి ఖైదీలందరూ అర్హులే. కోర్టులో హాజరు పరిచే సందర్భంలోనూ, విచారణ తతంగం నడుస్తున్న సమయంలోనూ, ఫీజు లేకుండా ఖైదీకి ఒక డిఫెన్స్ లాయర్‌ను ఏర్పాటు చేయడం సంబంధిత లీగల్ సర్వీసెస్ అథారిటీ బాధ్యత.

### 46. లీగల్ సర్వీసెస్ అథారిటీ అంటే ఏమిటి ?

కస్టడిలో వున్నవ్యక్తులతో సహా, అర్హులైన వాళ్ళందరికీ ఉచిత న్యాయ సహాయం అందించేందుకు ప్రభుత్వం జాతీయ, రాష్ట్ర, జిల్లా, తాలూకా స్థాయిల్లో లీగల్ సర్వీసెస్ అథారిటీలను ఏర్పాటు చేసింది. అరెస్ట్ అయిన 24 గంటలలోగా మొదటిసారి కోర్టులో హాజరు పర్చినప్పుడు ప్రతి  వ్యక్తికి ఒక లాయర్ ఉండేలా చూడటం లీగల్ అథారిటీల బాధ్యత. మొదటి సారి కోర్టులో హాజరు పరచినప్పుడు ఖైదీకి లాయర్ లేని సందర్భంలో, మేజిస్ట్రేట్ తప్పని సరిగా అతని /ఆమె డిఫెన్సుకు లీగల్ ఎయిడ్ లాయర్‌ను ఏర్పాటు చేయాలి. ఇవన్నీ ఉన్నప్పటికీ, లాయర్ లేకుండానే ఖైదీని  జైలులో చేర్చుకుంటే, లేదా నియమించిన లాయర్ రాకపోతే, ఖైదీ వెంటనే ప్రిజన్  లీగల్ ఎయిడ్ క్లినిక్ లేదా జైలు అధికారిని కలిసి మాట్లాడొచ్చు. లీగల్ ఎయిడ్ కోసం దరఖాస్తు పెట్టే చర్యలు వారు చేపడతారు .

**47. లీగల్ ఎయిడ్ లాయర్ కోసం ఖైదీ ఎలా దరఖాస్తు చేయవచ్చు ?**

పారాలీగల్ వాలంటీర్లను, లేదా జైలు విజిటింగ్ లాయర్లను (వీరు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్స్ నడుపుతారు) ఖైదీలు సంప్రదించవచ్చు. ప్రత్యామ్నాయ మార్గంగా వారు జైలు అధికారిని లేదా వెల్ఫేర్ ఆఫీసర్‌ని కలిసినట్టయితే ఆ అధికారులు విషయాన్ని లీగల్ సర్వీసెస్ అథారిటీ దృష్టికి తీసుకెళతారు.

**48. లీగల్ ఎయిడ్ అందించే వారి ద్వారా ఏ ఏ సేవలు ఉచితంగా పొంద వచ్చు?**

ఉచిత లీగల్ సర్వీసులలో – (ఎ) కోర్టు ఫీజు, ఇతర ప్రాసెస్ ఫీజులు, (బి) నిందితుని తరపున కోర్టులో వాదన (లీగల్ రిప్రెజెంటేషన్), (సి) ఉత్తర్వుల, ఇతర డాక్యుమెంట్ల సర్టిఫైడ్ కాపీలు, (డి) లీగల్ ప్రొసీడింగ్స్‌కి సంబంధించిన డాక్యుమెంట్ల ప్రింటింగ్, అనువాదం సహా అప్పీల్‌ను, పేపర్ బుక్‌ని సిద్ధం చేయడం... వుంటాయి.

**49. లీగల్ ఎయిడ్ లాయర్‌లకు ఏవైనా ఫీజులు చెల్లించాలా?**

లేదు. లీగల్ ఎయిడ్ లాయర్‌లకు ఖైదీలు ఏమీ చెల్లించకూడదు. ఎవరైనా లాయర్ డబ్బు అడిగితే సంబంధిత లీగల్ సర్వీసెస్ అథారిటీ దృష్టికి ఈ విషయం తీసుకువెళ్ళాలి.

**50. తన కోసం లీగల్ ఎయిడ్ లాయర్ నియమించబడ్డ సంగతి ఖైదీకి ఎలా తెలుస్తుంది ?**


లాయర్‌ని నియమించిన పిదప, ఖైదీకి ఈ సంగతి తెలియ జేస్తూ, జైలు పాలన సిబ్బంది లేదా పారాలీగల్ వాలంటీర్ లేదా విజిటింగ్ లాయర్ ద్వారా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఖైదీకి ఒక లేఖను పంపాలి. లేఖలో లాయర్ పేరు, అతడిని సంప్రదించేందుకు వివరాలు వుండాలి.

**51. తమ కేసు వివరాలు తెలుసుకునేందుకు, విచారణకు సిద్ధపడేందుకు ఖైదీలు లాయర్‌ను కలుసుకోవచ్చా ?**

అవును, తమ కేసు వివరాలు చర్చించి బెయిల్ దరఖాస్తు పెట్టడానికి, విచారణకు సిద్ధ పడటానికి లేదా రివ్యూ పిటీషన్ వేయడానికి ఖైదీలు తప్పకుండా జైలులో లాయర్‌ను కలుసుకోవచ్చు. విచారణకు కోర్టుకు తీసుకుపోయినప్పుడు కూడా ఖైదీ తన లాయర్‌ను కలవవచ్చు. ఖైదీని వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా కోర్టులో హాజరు పరుస్తున్నప్పుడు, హియరింగ్‌కు ముందే తన లాయర్‌ను కలిసే అవకాశమివ్వాల్సిందిగా ఖైదీ కోర్టు వారికి రాతపూర్వకంగా మనవి చేయవచ్చు.

**52. ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ అంటే ఏమిటి ?**

ప్రస్తుతం అమలులో వున్న నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ నియమనిబంధనల ప్రకారం భారత్‌లోని ప్రతి జైలులో లీగల్ ఎయిడ్ క్లినిక్ తప్పనిసరిగా వుండాలి. ఈ క్లినిక్‌లను లీగల్ ఎయిడ్ ప్రొవైడర్స్ – అనగా, శాసన విహిత లీగల్ ఎయిడ్ అథారిటీ నియమించిన పారాలీగల్ వాలంటీర్‌లు, జైలు విజిటింగ్ లాయర్‌లు నిర్వహిస్తారు. పారా లీగల్ వాలంటీర్‌లు బయటి సమాజం నుంచి వచ్చిన లేదా ఖైదీల లోంచి తీసుకున్న పారా లీగల్స్ అయివుండవచ్చు, లేదా ఈ రెండింటి కలయిక అయివుండవచ్చు. న్యాయ సహాయం కోసం, తమ సొంత సివిల్ అంశాలపై సలహా కోసం ఖైదీలు ప్రిజన్ లీగల్ క్లినిక్‌లను సంప్రదించవచ్చు.




# జైలు క్రమశిక్షణ

**53. జైలులో నేరాలను, శిక్షలను పర్యవేక్షించేందుకు ఎలాంటి చట్టాలు, నిబంధనలు వున్నాయి ?**

రాష్ట్ర ప్రిజన్ మాన్యువల్ లో జైలు నేరాలు, శిక్షలకు నిర్వచనం ఇచ్చారు. జైలులో యథేచ్ఛగా వేసే శిక్షలను వ్యతిరేకించే హక్కు ఖైదీలందరికీ వుంది. దీనర్థం – క్రమ శిక్షణ ఉల్లంఘనకు పాల్పడ్డారన్న ఆరోపణ తమపై వచ్చినప్పుడు ఖైదీలు ఇలా చేయవచ్చు : (i) ప్రిజన్స్ ఆక్ట్ అండ్ రూల్స్ ని ఏ రీతిన ఉల్లంఘించారో స్పష్టమైన సమాచారం కోరడం (ii) డిఫెన్స్ వాదన వినిపించడం. (iii) డిసిప్లీనరి ప్రొసీడింగ్స్ నిర్ణయం గురించిన సమాచారం తీసుకోవడం (iv) ఆక్ట్‌లో వున్ననిబంధనల మేరకు అప్పీల్ చేసుకోవడం. కేసుకు సంబంధించిన వాస్తవాలు, పరిస్థితులకు అనుగుణం గా ఖైదీలకు ఏ శిక్ష వేయాలో జైలు ఇంచార్జ్ ఆఫీసర్ నిర్ణయిస్తాడు .

**54. జైలులో ఎలాంటి శిక్షలు వేస్తారు ?**

జైలులో వేసే శిక్షలు పెద్దవి కావచ్చు, చిన్నవి కావచ్చు. హెచ్చరించి వదిలేయడం, సౌకర్యాలు (ప్రివిలేజెస్) తొలగించడం... వంటివి చిన్నశిక్షలు, సాధించుకున్న రేమిషన్ (శిక్షా కాలం తగ్గింపు) రద్దు చేయడం, వేరే జైలుకు బదిలీ, భద్రతా కోణంలో కదలికలను కట్టడి చేయడం, ఖైదీ చర్య మూలంగా ఏదైనా నష్టం జరిగి వుంటే దాని ఖర్చులు రికవరీ చేయడం... మొదలైనవి పెద్ద శిక్షలు. ఏదేమైనా, న్యాయ సమీక్ష జరపకుండా సౌకర్యాలు రద్దు చేయడం, శిక్షించే ఉద్దేశంతో మరో జైలుకు బదిలీ చేయడం... తదితర శిక్షలు ఖైదీలకు విధించరాదు. జైలు నేరాలు, అందుకు శిక్షలు అన్ని రాష్ట్రాల జైలు మాన్యువల్‌లలో పొందు పరిచి వున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో నిర్బంధ ఏకాంత వాసం విధించడం కూడా వుంది.

**55. నిర్బంధ ఏకాంత వాసం (solitary confinement) అంటే ఏమిటి?**

ఇతర మనుషులతో ఎలాంటి సంపర్కం లేకుండా రోజుకు 22 గంటలు ఖైదీని ఒంటరిగా బందీని చేయడం నిర్బంధ ఏకాంత వాసం. ఈ శిక్ష విధించే ఇంచార్జ్ ఆఫీసర్ అధికారం గురించి పలు జైలు మాన్యువల్స్‌లో ప్రస్తావించినప్పటికీ వివిధ సందర్భాల్లో సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను బట్టి, కాంపేటెంట్ కోర్టు మాత్రమె ఇది విధించగలదు.

**56. ఖైదీని నిరవధికంగా నిర్బంధ ఏకాంత వాసంలో ఉంచవచ్చునా ?**

లేదు. నిర్బంధ ఏకాంత వాసం14 రోజులకు మించకూడదనీ, రెండు దఫాల నిర్బంధ ఏకాంతవాసం నడుమ అన్ని రోజుల విరామ కాలం ఇవ్వాలనీ ఇండియన్ పీనల్ కోడ్ 1860 నిర్దేశిస్తున్నది. సెషన్స్ కోర్టు జడ్జ్ అనుమతి లేనిదే ఒక వ్యక్తికి 30 రోజులకు మించి ఏకాంతవాసం విధించరాదు. ఒక కోర్టు విధించే మొత్తం నిర్బంధ ఏకాంత వాసకాలం మూడు నెలలు మించకూడదు .

**57. నిర్బంధ ఏకాంత వాసం, ఒంటరి వార్డు (isolation ward) లో ఉండటం-రెండూ ఒకటేనా ?**


కాదు. ఈ రెండూ వేరువేరు. భద్రత లేదా ఇతర కారణాల వల్ల ఖైదీని ఇతరుల నుండి దూరంగా ఉంచేది ఐసోలేషన్ వార్డ్. ఇలాంటి ఖైదీకి నిర్బంధ ఏకాంత వాసంలో వున్న ఖైదీకి వర్తించే నిబంధనలుండవు .

**58. ఖైదీలను కొరడాతో కొట్టడం, గొలుసులతో బంధించడం జరుగుతుందా ?**

లేదు. ఖైదీలను కొరడాతో కొట్టడం, గొలుసులతో బంధించడం చట్ట విరుద్ధం. అలాంటి చర్యలను నిషేధిస్తూ సుప్రీంకోర్టు పెక్కుసార్లు ఆదేశాలిచ్చింది. అయితే చాలా రాష్ట్రాల్లో జైలు నిబంధనలను మార్చనందున ఈ శిక్షలను ప్రస్తావిస్తూనే ఉన్నాయి. ఇలాంటి శిక్షలకు గురయిన ఖైదీ తన లాయర్ ద్వారా కోర్టులో వీటిని సవాలు చేయవచ్చు, సదరు జైలును సందర్శించే బోర్డ్ ఆఫ్ విజిటర్స్ సభ్యులకు ఫిర్యాదు చేయవచ్చు కూడా.

**59. క్రమ శిక్షణ నెలకొల్పేందుకు బలప్రయోగం చేయవచ్చునా ?**

ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే బలప్రయోగానికి, ఆయుధాల వాడకానికి అనుమతి వుంది. ఉదాహరణకు – ఒక ఖైదీ (i) పారిపోతూంటే అతణ్ణి /ఆమెను ఆపడానికి జైలు సిబ్బందికి మరోమార్గం లేకపోతే (ii) జైలు బయటి గేటును లేదా గోడను కూల్చే ప్రయత్నంలో వుంటే (iii) జైలు సిబ్బంది లేదా మరో వ్యక్తి మృతి చెందేలా లేదా తీవ్రంగా గాయపడేలా హింసకు పాల్పడితే...బలప్రయోగానికి పూనుకోవచ్చు. అతడిని కాల్చబోతున్నామని ఖైదీని స్పష్టంగా, బిగ్గరగా హెచ్చరించిన తర్వాతనే తుపాకులు ఉపయోగించాలి. ఘాతుకానికి ఒడిగట్టబోయే ఖైదీని నిలువరించేందుకు స్వల్పస్థాయి బలప్రయోగం మాత్రమే జరుగుతున్నదని జైలు సిబ్బంది ధృవపరచుకోవాలి.




## ఫిర్యాదుల స్వీకరణ, జైలు నిర్లక్ష్యం

### 60. జైలులో ఏదైనా సమస్య ఎదుర్కొంటే ఖైదీ ఫిర్యాదు చేయవచ్చునా ?

చేయవచ్చు. తనను జైలు సిబ్బంది సరిగ్గా చూడక పోయినా, తోటి ఖైదీలు బాధలు పెడుతున్నా, మెడికల్, కుటుంబ, న్యాయపరమైన సాయం అందక పోయినా, తిండి, జీవన స్థితిగతుల విషయంగా ఏవైనా సమస్యలున్నా – ఖైదీ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు.

### 61. ఏ ఏ అధికారులకు ఖైదీ ఫిర్యాదు చేయవచ్చు ?

ఖైదీలు ప్రిజన్‌కు చెందిన ఏ సీనియర్ అధికారికైనా – ఇన్స్‌పెక్టర్ జెనరల్ ఆఫ్ ప్రిజన్స్‌కు, ప్రభుత్వానికి, లేదా న్యాయ స్థానానికి నేరుగా ఫిర్యాదులు చేయవచ్చు. జైళ్ళను సందర్శించే బోర్డు మెంబర్‌లకు లేదా తమ లాయర్లకు కూడా ఫిర్యాదు చేయవచ్చు. డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జికి, ఇతర న్యాయాధికారికి ఖైదీలు తమ సమస్యలు, ఇక్కట్లు చెప్పుకోవచ్చు. ఆ న్యాయ పరిధిలోని జైళ్ళను విధ్యుక్తంగా సందర్శించాల్సిన జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రేటరీకి, లేదా తాలూకా లీగల్ సర్వీసెస్ కమిటీకి సైతం ఫిర్యాదులు పంపుకోవచ్చు.

## 62. ఫిర్యాదుల స్వీకరణ వ్యవస్థ అంటే ఏమిటి ?

ఖైదీల ఫిర్యాదు ల కోసం ప్రతి జైలులో 'క్రియాశీలమైన' గ్రీవియన్స్ రిడ్రెసల్ సిస్టం (GRS) వుండాలని ది మోడల్ ప్రిజన్ మాన్యువల్ 2016 నిర్దేశిస్తున్నది. ఖైదీలు తమ రాతపూర్వక ఫిర్యాదులు వేసేందుకు వీలుగా జైలు లోని ఒక అనుకూలమైన, అందరికీ అందుబాటులో వుండే స్థలంలో కంప్లయంట్ బాక్సులు పెట్టాలని ఈ మాన్యువల్ సూచిస్తున్నది. ఆ బాక్సుకి తాళం వేసి దాని తాళంచెవి డిప్యూటీ సూపరింటెండెంట్, దగ్గర ఉండేలా చూడాలి. లీగల్ సర్వీసెస్ అథారిటీలు కూడా అలాంటి బాక్సులు పెట్టాలి, వాటి తాళాలు డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రేటరి దగ్గర వుండాలి.

## 63. జైళ్ళను ఎవరు తనిఖీ చేస్తారు ?

జైళ్ళను, శిక్షాపద్ధతులను తరచుగా తనిఖీ చేసేందుకు రెండు అంచెల వ్యవస్థ వుంది. అమలులో వున్నచట్టాలు, నిబంధనలు, విధానాలు, ఆనవాయితీలకు అనుగుణంగా పీనల్, కరెక్షనల్ సర్వీసులు నిర్వహించబడేలా, ఖైదీల హక్కులు పరిరక్షింప బడేలా జైళ్ళ మీద పర్యవేక్షణ చేయడం దీని విధి. జైళ్ళ పర్యవేక్షణ యంత్రాంగానికి రెండు బాధ్యతలున్నాయి :

(ఎ) రాష్ట్ర జైళ్ళ శాఖ చేత అంతర్గత లేదా పాలనాపరమైన తనిఖీలు జరిపించడం,

(బి) జైలు పాలన సిబ్బందితో సంబంధం లేని ఒక స్వతంత్ర సంస్థ చేత బయటి నుంచి తనిఖీ చేయించడం, ఇందులో అర్హమైన అంతర్జాతీయ లేదా స్థానిక సంస్థలు ఉండవచ్చు.

## 64. బయటి సంస్థలు ఏవి జైళ్ళను తనిఖీ చేయవచ్చు ?

పలు సంస్థలకు జైళ్ళను తనిఖీ చేసే అధికారం వుంది. జుడిషియల్ అధికారులు, ప్రత్యేకించి జిల్లా జడ్జీలు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు; ఎక్స్– అఫీషియో, నాన్ – అఫీషియల్ విజిటర్స్‌తో కూడిన బోర్డ్ ఆఫ్ విజిటర్స్, అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ (UTRC), జాతీయ, రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీలు (NALSA /SLSA), జాతీయ, రాష్ట్ర మానవ హక్కుల సంఘాలు తనిఖీలు నిర్వహిస్తాయి.

## 65. బోర్డ్ ఆఫ్ విజిటర్స్ (BOV) సభ్యులు ఎవరు ?

ఆయా రాష్ట్రాల ప్రిజన్ రూల్స్‌ని బట్టి ఇది మారుతుంది, అయితే మోడల్ ప్రిజన్ మాన్యువల్ 2016, BOV కూర్పు కింది విధంగా వుండాలని సూచిస్తున్నది:

**అఫీషియల్ సభ్యులు :** డిస్ట్రిక్ట్, సెషన్స్ కోర్టు జడ్జి లేదా సబ్–డివిజనల్ జుడిషియల్ మేజిస్ట్రేట్, డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్/డిస్ట్రిక్ట్ కలెక్టర్ లేదా సబ్–డివిజనల్ ఆఫీసర్... తదితర ప్రభుత్వాధికారులు, డిస్ట్రిక్ట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, హెల్త్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన చీఫ్ మెడికల్ ఆఫీసర్ లేదా సబ్–డివిజనల్ స్థాయి సబ్ – డివిజనల్ మెడికల్ ఆఫీసర్, పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌కి చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లేదా అసిస్టెంట్ ఇంజనీర్, డిస్ట్రిక్ట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్, డిస్ట్రిక్ట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, డిస్ట్రిక్ట్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్, డిస్ట్రిక్ట్ అగ్రికల్చరల్ ఆఫీసర్, డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఆఫీసర్.

**నాన్ – అఫీషియల్ సభ్యులు (NOV) :** ఒక మహిళతో కూడిన ముగ్గురు రాష్ట్ర శాసనసభ సభ్యులు, రాష్ట్ర మానవ హక్కుల సంఘం నుంచి ఒక నామినీ, డిస్ట్రిక్ట్/సబ్ – డివిజన్ నుంచి ఇద్దరు సోషల్ వర్కర్లు – ఇందులో జైళ్ళ నిర్వహణ, ఖైదీల

సంక్షేమం పట్ల ఆసక్తి గల ఒక మహిళ వుండాలి. NOV లో కౌన్సిలింగ్, లా, మెడిసిన్ రంగాలకు చెందిన వ్యక్తులుండవచ్చు. సెంట్రల్, డిస్ట్రిక్ట్, సబ్ జైళ్లకు NOV ల సంఖ్య, వాళ్ళ పదవి కాలం వేర్వేరుగా వుంటుంది.

**66. BOV బాధ్యతలేవి ?**

జైళ్ళలో పరిస్థితులను క్రమ పద్ధతిలో పర్యవేక్షించడం బోర్డ్ బాధ్యత. ఈ సభ్యులు జైళ్ళను సందర్శిస్తారు, ఖైదీల సమస్యలు వింటారు, పరిస్థితులను మెరుగు పరచడానికి సంబంధిత అధికారులకు సిఫార్సులు పంపిస్తారు. జైలులో వసతులు (బ్యారక్స్, వర్క్‌షెడ్‌లు, ఇతర భవనాలు), ఖైదీల ఆహారం నాణ్యతా పరిమాణాలు, జైలు వంటగది, ఆస్పత్రిలో పరిస్థితులు, నీటి సరఫరా, పారిశుధ్యం తీరుతెన్నులు, మందుల అందుబాటు, ఆసుపత్రుల నిర్వహణ, వైద్య చికిత్స, వొకేషనల్ శిక్షణ, అక్షరాస్యత – లైబ్రరీ సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, జైలులో శిక్షలు... మొదలైనవి తనిఖీ చేస్తారు. ఖైదీల వైయక్తిక, సామూహిక సమస్యలు, ఫిర్యాదులు పరిశీలించి పరిష్కారాలు సూచిస్తారు. జైలు రికార్డులు తనిఖీ చేసి వ్యవహారాలు చట్ట బద్ధంగా, న్యాయ బద్ధంగా జరుగుతున్నాయా లేదా నిర్ధారిస్తారు, దిద్దుబాటు చర్యలు సిఫారసు చేస్తారు. వీరి పనులు, కార్యక్రమాలు జైలు వ్యవహారాల్లో పారదర్శకతను పెంచుతాయి.

**67. అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ (UTRC) అంటే ఏమిటి ?**

ఏప్రిల్ 2015 లో ఒక పిటిషన్ సందర్భంగా సుప్రీం కోర్టు Re-Inhuman Conditions in 1382 Prisons లో ఇచ్చిన ఆదేశానుసారం – ప్రతి జిల్లాలో UTRC ని ఏర్పాటు చేయడం జరిగింది. అవసరం లేని డిటెన్షన్‌లను పసి గట్టేందుకు అన్ని ఖైదీల కేసులను UTRC పరిశీలించి వారి విడుదల కోసం సరైన చర్యలు తీసుకుంటుంది. UTRC ప్రతి మూడు నెలల కొకసారి సమావేశమవుతుంది .

**68. UTRC లో సభ్యులు ఎవరు ?**

ప్రతి జిల్లాలో 5 గురు సభ్యులతో కూడిన UTRC వుంటుంది. డిస్ట్రిక్ట్ & సెషన్స్ జడ్జి (ఛైర్ పర్సన్), డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్, పోలీస్ సూపరింటెండెంట్, ఆఫీసర్ – ఇన్ – చార్జ్ ఆఫ్ ప్రిజన్స్, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ఈ కమిటీలో వుంటారు.

**69. ఎలాంటి కేసులను UTRC సమీక్షిస్తుంది ?**

ఈ కింది క్యాటగిరీలకు చెందిన ఖైదీల కేసులు UTRC చేత సమీక్షకు అర్హమైనవి :

(I) సెక్షన్ 436ఎ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (CrPC) 1973కింద విచారణ ఖైదీలు,

(ii) సెక్షన్ 436 ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ కింద విచారణ ఖైదీలు,

(iii) కోర్టు ఇచ్చిన బెయిల్ ద్వారా విడుదలయి పూచి కత్తు సమర్పించలేని విచారణ ఖైదీలు,

(iv) సెక్షన్ 167(2) (ఎ) (I) & (ii) ఆఫ్ ది CrPC కింద విడుదలకు అర్హులైన విచారణ ఖైదీలు –

ఎ). 90 రోజులలోగా దర్యాప్తు పూర్తి కాని సందర్భంలో,

బి). 60 రోజులలోగా దర్యాప్తు పూర్తి కాని సందర్భంలో

సి). 180 రోజులలోగా దర్యాప్తు పూర్తి కాని సందర్భం లో [సెక్షన్ 167 రెడ్ విత్ సెక్షన్ ఎ ఆఫ్ ది నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకో ట్రాపిక్ ఆక్ట్, 1985 (సెక్షన్ 19 లేదా 24 లేదా 27 ఎ కింద, లేదా అక్రమ వ్యాపార (కమర్షియల్ క్వాంటిటి) సంబంధ నేరాల్లో నిందితులు)]

(v) సెక్షన్స్ 107, 108, 109 & 151 ఆఫ్ CrPC కింద నేరస్తులుగా అనుమానించబడిన విచారణ ఖైదీలు,

(vi) సెక్షన్ 3 ఆఫ్ ప్రొబేషన్ ఆఫ్ అఫెండర్స్ ఆక్ట్, అనగా సెక్షన్స్ 379, 380, 381, 404, 420 ఆఫ్ IPC 1860 కింద నేరారోపణ ఎదుర్కొంటున్న వారు, లేదా రెండు సంవత్సరాలకు మించని జైలు శిక్ష పడగల నేరానికి నిందితులు,

(vii) అనేక నేరాలు చేసిన ఆరోపణ ఎదుర్కొంటున్న విచారణ ఖైదీలు,

(viii) గరిష్టంగా రెండేళ్ళు శిక్ష పడగల నేరారోపణ ఎదుర్కొంటున్న విచారణ ఖైదీలు (వీరిని ప్రొబేషన్ ఆఫ్ అఫెండర్స్ ఆక్ట్ 1958 కింద విడుదల చేయవచ్చు)

(ix) విచారణ ఎదుర్కొంటున్న మహిళా ఖైదీలు

(x) జబ్బుపడ్డ లేదా లేవలేని లేదా ప్రత్యేక వైద్య చికిత్స అవసరమున్న విచారణ ఖైదీలు - సెక్షన్ 437 ఆఫ్ CrPC కింద వీరికి బెయిల్ మంజూరు చేయవచ్చు,

(xi) మానసిక స్థిమితం కోల్పోయిన విచారణ ఖైదీలు,


(xii) ఏడేళ్ళు శిక్ష పడగల నేరారోపణ ఎదుర్కొంటూ, కనీసం 1/4 శిక్షాకాలం పూర్తిచేసిన 19 –21 ఏళ్ళున్న కొత్త నేరస్తులు - వీరిని ప్రొబేషన్ ఆఫ్ అఫెండర్స్ ఆక్ట్ 1958 కింద విడుదల చేయవచ్చు

(xiii) మేజిస్ట్రేట్ చేత విచారించ దగ్గ విచారణ ఖైదీలు - వ్యక్తి నాన్ బెయిలేబుల్ నేరారోపణ ఎదుర్కొంటూ, అతని /ఆమె విచారణ, సాక్ష్యాధారాలు (సెక్షన్ 437 ఆఫ్ CrPC) తీసుకునే మొదటి తేది ఖరారైన 60 రోజుల్లోగా పూర్తికాక పోతే,

(xiv) శిక్షా కాలం ముగించుకున్న లేదా రెమిషన్ మంజూరై విడుదలకు అర్హులైన ఖైదీలు.

**70. జైళ్ళను పర్యవేక్షించే బాధ్యత న్యాయ వ్యవస్థకున్నదా?**

న్యాయ వ్యవస్థలో డిస్ట్రిక్ట్ జడ్జీలకు కీలక బాధ్యత వున్నది, వీరు క్రమం తప్పకుండా జైళ్ళను తనిఖీ చేస్తూ సంబంధిత డిపార్ట్‌మెంటుల నడుమ సమన్వయము ఉండేలా చూడాలి. వీరు సమీక్షా కమిటీలలో భాగ స్వాములు - జైలులో ఆరోగ్య స్థితిగతులు, చట్ట విరుద్ధ డిటెన్షన్లు, ఖైదీల ఫిర్యాదులు, జైలు లోపల జరిగే గాయాలు, మరణాలు... మొదలైన వాటిపై నివేదిక తయారు చేస్తారు. జైలులో రిమాండులో వున్నఖైదీలు జుడీషియల్ కస్టడీలో ఉన్నట్టే. వాళ్ళ బాధ్యత తీసుకోవాల్సింది కోర్టులే కాబట్టి ఖైదీల బాగోగులపై అవి తప్పనిసరిగా దృష్టి పెట్టాలి. జైలు నిర్వహణ, ఖైదీలను-ప్రత్యేకించి సమస్యాత్మక సమూహాలను చూసే తీరు, వారికి న్యాయ సహాయం లభ్యతలకు సంబంధించి నిర్దేశిత ప్రమాణాలు అమలయ్యేలా కూడా న్యాయ వ్యవస్థ చూడాలి.



# పెరోల్, ఫర్లాఫ్, రెమిషన్, ముందస్తు విడుదల

## 71. పెరోల్ అంటే ఏమిటి ?

తన కుటుంబంతో, బయటి సమాజంతో సామాజిక సంబంధాలు నెరపేందుకు వీలుగా ఖైదీని స్వల్పకాలం పాటు తాత్కాలికంగా విడుదల చేయడాన్ని 'పెరోల్' అంటారు. జైలు బయట ఖైదీ గడిపే ఈ కాలాన్ని శిక్షా కాలంగా పరిగణించరు, ఇందుకు ఖైదీ జైలులో అదనపు కాలాన్ని గడపాల్సి వుంటుంది.

## 72. ఫర్లాఫ్ అంటే ఏమిటి ?

జైలులో నిర్దిష్ట సంవత్సరాల కాలం గడిపిన తర్వాత, ఆ కాలంలో ఖైదీ మంచి నడవడి, క్రమశిక్షణతో మెలగినట్టు గుర్తించబడితే, అందుకు ప్రతిఫలంగా అతణ్ణి/ఆమెను స్వల్పకాలం కోసం విడుదల చేయడాన్ని 'ఫర్లాఫ్' అంటారు. జైలులో సత్ప్రవర్తనకు ఇది  ప్రోత్సాహకం మాత్రమే. ఈ స్వల్ప కాలాన్ని శిక్షాకాలంలో భాగంగా పరిగణిస్తారు.

## 73. కుటుంబ పరమైన అత్యవసర పరిస్థితిలో ఖైదీ తాత్కాలిక విడుదల కోరుకోవచ్చునా?

కుటుంబ పరమైన అత్యవసర పరిస్థితిలో జైలు శాఖ ప్రధానాధికారి ఖైదీకి స్వల్ప కాలిక తాత్కాలిక విడుదల లేదా ఎమెర్జెన్సి పెరోల్ మజూరు చేయవచ్చు. సాధారణంగా ఖైదీ దిగువ కారణాలు చూపి సెలవును అభ్యర్థించవచ్చు:

(1) ఖైదీ కుటుంబ సభ్యులెవరైనా చనిపోతే లేదా తీవ్రంగా జబ్బు పడితే, లేదా ఖైదీ స్వయంగా తీవ్రమైన అనారోగ్యం పాలైతే –

(2) ఖైదీకి లేదా ఖైదీ సమీప బంధువుకు పెళ్లవుతున్నట్టయితే –

(3) దుక్కి దున్నడం, విత్తడం, పంట కోయడం... వంటి వ్యవసాయ పనులకు ఖైదీ అవసరమైతే –

(4) మరేదైనా తగిన కారణమున్నట్టయితే –

**74. తాత్కాలిక విడుదల కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలి?**

తాత్కాలిక విడుదల కోరే ఖైదీ జైలు ఇంచార్జ్ ఆఫీసర్‌కు దరఖాస్తు పెట్టుకోవాలి. ఖైదీ అర్హతను దృష్టిలో ఉంచుకుని ఆఫీసర్ ఆ దరఖాస్తును పరిశీలించి పై అధికారులకు పంపిస్తాడు, పై అధికారి దాన్ని జిల్లా మేజిస్ట్రేట్ ద్వారా జిల్లా ఎస్పీకి పంపిస్తాడు. ఎస్పీ మళ్ళా మేజిస్ట్రేట్ ద్వారా శాసన విహిత అధికారి (కాంపేటెంట్ అథారిటీ)కి నివేదిక ఇస్తాడు. విడుదలకు అనుమతించనట్లయితే అతడు తగిన కారణాలు పేర్కొనాలి. అంతిమంగా కాంపేటెంట్ అథారిటీ దరఖాస్తుపై నిర్ణయం తీసుకుంటాడు. ఒకవేళ అది తిరస్కరణకు గురయితే అందుకు కారణాలతో సహా ప్రతి దశలో దాని గురించిన నిర్ణయాలు ఖైదీకి తెలియబరుస్తుండాలి. తాత్కాలికంగా విడుదల కోరే ఖైదీ కొన్ని షరతులకు ఒప్పుకోవాలి. నగదు సెక్యూరిటీ లేదా వ్యక్తిగత పూచీకత్తు, నిర్దేశిత ప్రదేశంలోనే వుండేందుకు సమ్మతించడం, విడుదల కాలంలో సత్ప్రవర్తనతో ఉంటానని హామీ ఇవ్వడం ,విడుదల కాలం ముగియగానే జైలుకు తిరిగి వస్తానని అంగీకరించడం... మొదలైనవి ఆ షరతులు.

**75. రెమిషన్ అంటే ఏమిటి ?**

సత్ప్రవర్తన కలిగి జైలు నియమాలను పాటించినందుకు ఖైదీల కిచ్చే పాయింట్లు లేదా రోజుల పద్ధతే రెమిషన్. పాయింట్లు సాధించుకున్నందుకు ఖైదీ శిక్షా కాలాన్ని కుదిస్తారు లేదా తగ్గిస్తారు. ఒక్కో నెల సత్ప్రవర్తనకు ఖైదీ రెమిషన్ రికార్డ్‌లో జమ అయ్యే పాయింట్లు/రోజులు అతని శిక్షాకాలంలో కొన్ని దినాలు తగ్గిస్తాయి. తన మొత్తం శిక్షా కాలంలో 1/3 వంతు రెమిషన్‌గా ఖైదీ సముపార్జించుకోవచ్చు.

**76. రెమిషన్ ఎన్ని రకాలు ?**

రెమిషన్ మూడు రకాలు : ఎ). ప్రిజన్స్ అక్ట్ 1984 లోని అంశాలు, లేదా రాష్ట్ర ప్రిజన్స్ అక్ట్ నియమాలను అనుసరించి ఇచ్చే రెమిషన్, బి). సెక్షన్ 432 ఆఫ్ CrPC కింద సంబంధిత ప్రభుత్వం శిక్షా కాలంలో ఇచ్చే రెమిషన్, సి). భారత రాజ్యాంగం 1950 లోని ఆర్టికల్ 72 లేదా 161 ననుసరించి రాజ్యాధినేత ఇచ్చే రెమిషన్.

**77. జైలు అధికారులు ఏ రకం రెమిషన్ మంజూరు చేయవచ్చు?**

జైలు అధికారులు ఈ కింది రకాల రెమిషన్ మంజూరు చేయవచ్చు:

ఏ). సాధారణ రెమిషన్–ఇది జైలు సూపరింటెండెంట్ లేదా అతను నామినేట్ చేసిన మరో అధికారి ఇస్తాడు. దీని మంజూరుకు అర్హతలు, పరిమితులు రాష్ట్ర ప్రిజన్ మాన్యువల్‌లో పొందు పరచి వుంటాయి. మామూలుగా, రెండు నెలలు లేదా అంతకు మించి కారాగార వాసం విధించబడిన ఖైదీలు సాధారణ రెమిషన్‌కు అర్హులు. ఒక కాలెండర్ నెలకు – సత్ప్రవర్తనకుగాను మూడురోజులు, మంచి పనితీరుకు మూడు రోజులు, నైట్ వాచ్‌మెన్‌గా పనిచేసిన వారికి ఎనిమిది రోజులు, ఒక సంవత్సరకాలంలో, మిగతావారితో పోలిస్తే ఏ జైలు నేరం చేయక పోతే 30 వార్షిక దినాలు – ఇవీ రెమిషన్ కాల పరిమితులు.

బి). ప్రత్యేక రెమిషన్ : ఇది ప్రిజన్ సూపరింటెండెంట్ సిఫారసు మీద జైలు శాఖ ప్రధానాధికారి మంజూరు చేసేది. దీని మంజూరుకు అర్హతలు, పరిమితులు జైలు మాన్యువల్‌లో నిర్దేశించి వుంటాయి. సాధారణంగా, ఖైదీ చేసే ప్రతిభావంతమైన పనికి ప్రతిఫలంగా ప్రత్యేక రెమిషన్ ఇస్తారు. ఒక ప్రభుత్వోద్యోగి లేదా తోటి ఖైదీ లేదా జైలు సందర్శకుని ప్రాణాలు కాపాడడం, ఖైదీలు పారిపోకుండా ఆపే ప్రయత్నంలో సాయపడటం, అగ్నిప్రమాదం, అల్లర్లు, సమ్మెలు.. వంటి అత్యవసర పరిస్థితుల్లో జైలు అధికారులకు తోడ్పడడం : సాంస్కృతిక కార్యకలాపాల్లో, చదువుల్లో అత్యుత్తమ పనితీరు, పరిశ్రమ, వ్యవసాయం, వొకేషనల్ శిక్షణ... తదితర అభివృద్ధి కార్యక్రమాల్లో చక్కని కృషి – ఈ పనులు ప్రశంసలు కొని తెస్తాయి. ఒక కాలెండర్ సంవత్సరంలో ప్రత్యేక రెమిషన్ 30 రోజులు మించదు.

**78. ముందస్తు విడుదల అంటే ఏమిటి ?**

వాస్తవ శిక్షా కాలం పూర్తికాక మునుపే ఖైదీని విడుదల చేయడం 'ముందస్తు విడుదల' అంటారు. ఇది మూడు రకాలుగా ఇవ్వొచ్చు : ఏ). సెక్షన్ 433 ఆఫ్ CrPC కింద జీవిత ఖైదీల, లేదా ఇతర ఖైదీల శిక్షా కాలాన్ని కమ్యూటేషన్ చేయడం ద్వారా బి). సెక్షన్ 432 ఆఫ్ CrPC కింద ఖైదీ శిక్షా కాలాన్ని రెమిట్ చేయడం ద్వారా సి). భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 72 లేదా 161 కింద తన అధికారాలుపయోగించి రాజ్యాధినేత ఒక ఉత్తర్వు ఇవ్వడం ద్వారా డి). శిక్షా కాలంలో కొంత భాగం ముగించుకున్న ఖైదీలు సత్ప్రవర్తన ప్రొబేషన్ పూర్తి చేసుకున్నాక రాష్ట్రం వాళ్ళ విడుదల కోసం ఏదైనా ప్రత్యేక చట్టం జారీ చేయడం ద్వారా.

**79. ముందస్తు విడుదల మంజూరు చేసే విధానమేమిటి ?**

యోగ్యమైన కేసుల్లో ఖైదీలకు ముందస్తు విడుదలను సిఫారసు చేయడానికి ప్రతి రాష్ట్రంలో ఒక కమిటీ వుంది. ఈ కమిటీలను అనేక పేర్లతో వ్యవహరిస్తారు, సెంటెన్స్ రివ్యూ బోర్డులు, స్టేట్ లెవెల్ కమిటీలు ...మొదలైనవి. వీటి కూర్పు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా వుంది. సాధారణంగా వీటిలో – జైలు శాఖ ప్రధానాధికారి, ఒక సీనియర్ పోలీస్ ఆఫీసర్, ప్రిజన్స్ ఇంచార్జ్‌గా వున్న ప్రధాన కార్యదర్శి, చీఫ్ ప్రొబేషన్ ఆఫీసర్.. వుంటారు.

ఈ కమిటీ క్రమం తప్పకుండా సమావేశమవుతుంది, విడుదలకు అర్హమైన ఖైదీల కేసులను గుర్తిస్తుంది .ప్రతి జైలు ఇంచార్జ్ ఆఫీసర్ ముందస్తు విడుదలకు అర్హమైన కేసుల పరిశీలన ప్రారంభించి ఆ ఖైదీల గురించిన సమగ్రమైన నివేదికలు (నోట్స్) తయారు చేయాలి. ఖైదీ కుటుంబం, సామాజిక నేపథ్యం. నేరం వివరాలు, అందుకు దారి తీసిన పరిస్థితులు నివేదికలో పొందు పరచాలి. జైలులో వున్న కాలంలో ఖైదీ ప్రవర్తనా శైలిని, అతని శారీరక, మానసిక ఆరోగ్య స్థితిని కూడా నివేదిక ప్రతిబింబిస్తుంది.

**80. ముందస్తు విడుదలకు ఖైదీలందరూ అర్హులేనా ?**

కాదు. ఖైదీలందరికీ ఈ హక్కు వుండదు. అయినా –14 నుంచి 20 సంవత్సరాల నిర్ణీత శిక్షా కాలం (జీవిత ఖైదీల విషయంలో) ముగించుకున్నాక, లేదా తన శిక్షా కాలంలో నిర్దిష్ట భాగం పూర్తి చేసుకున్నాక, ఆ రాష్ట్రంలోని నిబంధనలననుసరించి, ఖైదీ ముందస్తు విడుదల హక్కు పరిగణనలోకి తీసుకోబడుతుంది.



# శిక్షా కాలం పూర్తి, బదిలీలు, విడుదల

## 81. జైలు శిక్షాకాలాన్ని ఎలా లెక్కగడతారు?

శిక్షా కాలాన్ని కాలెండర్ సంవత్సరాలు, నెలలు, రోజులుగా లెక్కిస్తారు. జీవిత ఖైదు అంటే నేరస్థుడు జీవితాంతం జైల్లో ఉండాల్సిందే. శిక్షాకాలపు మొత్తం గణనలో తీర్పు వెలువడిన, ఖైదీ విడుదలవుతున్న తేదీలను కలుపుతారు. ఉదాహరణకు : ఒక ఖైదీకి నెల రోజుల జైలుశిక్ష జనవరి ఒకటో తారీఖున ప్రకటించడం జరిగితే అతను జనవరి 31న విడుదలవుతాడు, అంతేకాని ఫిబ్రవరి 1 న కాదు. ఎట్టి పరిస్థితుల్లోనూ కోర్టు వారంట్‌లో పేర్కొన్న కాలాన్ని మించి ఖైదీని జైలులో ఉంచరాదు.

## 82. ఏకకాల (concurrent), క్రమానుగత (consecutive) శిక్షలంటే ఏవి?

ఒకటి కన్నా ఎక్కువ నేరాలు రుజువైన ఖైదీకి కోర్టు ఏకకాల (ఒకేసారి అనుభవించాల్సిన) లేదా క్రమానుగత (ఒకదాని తర్వాత మరొకటి అనుభవించాల్సిన) శిక్ష విధించవచ్చు. మొదటి కేసులో అన్ని శిక్షలు ఒకే సారి వర్తిస్తాయి, రెండో కేసులో అన్ని శిక్షల సగటు వర్తిస్తుంది. ఉదాహరణకు : ఒక ఖైదీకి అయిదేళ్ళు, మరియు ఏడేళ్ళ శిక్ష విధించడం జరిగితే – అది ఏక కాల శిక్ష అయితే

ఏడేళ్ళు, క్రమానుగత శిక్ష అయితే పన్నెండేళ్ళు అనుభవించాలి. అపరాధ పన్నుల చెల్లింపు డిఫాల్ట్ కేసుల్లో సాధారణంగా ఏక కాల శిక్షలు పడవు.

### 83. ఒక ఖైదీని ఏ సందర్భంలో వేరే జైలుకు బదిలీ చేస్తారు ?

వివిధ కారణాల వలన ఒక ఖైదీని వేరే జైలుకు బదిలీ చేస్తారు,


- ఏ ). అనారోగ్య కారణాలు,
- బి). విచారణకు లేదా సాక్ష్యం ఇచ్చేందుకు కోర్టులో హాజరు పరచాల్సి వున్నప్పుడు.
- సి). సొంత వూరికి ఖైదీ దగ్గరలో ఉండేందుకు.
- డి). భద్రత లేదా ఇతర జరూరు కారణాలు.
- ఇ). ఖైదీ పునరావాసాన్ని దృష్టిలో ఉంచుకుని మానవతా కోణంలో.

### 84. జైలు నుంచి ఖైదీ విడుదలయాక ఏమి జరుగుతుంది ?

ఖైదీ విడుదల రోజున, అడ్మిషన్ రికార్డు లేదా ప్రిజన్ మేనేజ్‌మెంట్ సిస్టంలోని వివరాలకు అతని/ఆమె గుర్తింపు సరిపోతున్నదా లేదా చెక్ చేస్తారు. జైలులో అడ్మిట్ చేసుకునేటప్పుడు తీసుకున్న నగదు, నగలు.. వగైరాలని ఖైదీకి తిరిగి ఇచ్చేస్తారు. బ్యాంక్ పాస్ బుక్కులు, అవసరమైన డాక్యుమెంట్స్ మొదలైనవి కూడా ఇస్తారు. వేతనాలు బ్యాంక్ ఖాతాలోనే జమ అయి వుంటాయి, లేకపోతే విడుదల రోజున మొత్తం లెక్కకట్టి ఇస్తారు. ఈ తతంగమంతా పూర్తయాక, సూపరింటెండెంట్ లేదా ఇంచార్జ్ ఆఫీసర్ ఖైదీ విడుదలకు తుది ముద్ర వేస్తాడు. ఖైదీ పేరును రిలీజ్ రిజిస్టర్‌లో నమోదు చేసి ప్రిజన్ మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్‌లో 'ఔట్' మార్క్ చేస్తారు. విడుదలకు ముందే రిజిస్టర్‌లో ఖైదీ సంతకం పెట్టాలి, ఎడమ చేతి బొటన వేలి ముద్రవేయాలి. శిక్ష అనుభవించిన ఖైదీలకు రిలీజ్ సర్టిఫికేట్ కూడా ఇస్తారు.

### 85. శిక్షా కాలం ముగిసినాక విడుదల కాకపోతే ఖైదీ ఎవరికి ఫిర్యాదు చేయాలి?

శిక్షా కాలం ముగిసినాక విడుదల కాకపోతే ఖైదీ–జైలు అధికారులకు, తన లాయర్‌లకు, కుటుంబ సభ్యులకు సమాచారమివ్వాలి. తను విడుదల కాక పోవడానికి కారణాలు అడుగుతూ సూపరింటెండెంట్‌కి పిటీషన్ పెట్టుకోవచ్చు. జుడిషియల్ ఆఫీసర్ల వద్ద ఈ విషయం లేవనెత్తవచ్చు, UTRC సభ్యులకు ఫిర్యాదు చేయవచ్చు, హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తికి లేఖ రాయవచ్చు.



# ప్రత్యేక అవసరాలున్న ఖైదీలు

**86. జైలులో 'సమస్యాత్మక' (సున్నిత పరిస్థితిలో వున్న) ఖైదీలు ఎవరు ?**

కొన్ని సమూహాలకు చెందిన ఖైదీలు ప్రత్యేకమైన సమస్యాత్మక స్థితిలో వుంటారు, అందువల్ల వారికి అదనపు రక్షణ, శ్రద్ధ అవసరమవుతుంది. సరైన వసతులు లేక ప్రత్యేక సమస్యలకు తగిన వైద్య నిపుణుడు లభించక కొందరు ఖైదీలు మరిన్ని బాధలు పడతారు. హింస, జాతి, మత, జెండర్ పరమైన వివక్ష, అంగ వైకల్యం కారణంగా కొందరు అవమానాలు ఎదుర్కొంటారు, శారీరక, మానసిక క్లేశానికి గురవుతారు. మహిళా ఖైదీలు, ఖైదీల పిల్లలు, విదేశీ ఖైదీలు, మరణ శిక్ష పడ్డ ఖైదీలు, యువ నేరస్థులు, దివ్యాంగులు, వృద్ధులు, శారీరకంగా పూర్తి బలహీనులు... ఈ కోవకి చెందుతారు.

**87. సమస్యాత్మక గ్రూపు అవసరాల పట్ల ఎలాంటి ప్రత్యేక శ్రద్ధ తీసుకునే వీలుంది?**

**1. మహిళలు :**

ఏ). మహిళా ఖైదీలను వేరే బందిఖానాలో పెట్టాలి. వాళ్ళను చూసుకునేందుకు మహిళా సిబ్బందినే నియమించాలి.

బి). జైలులో అడ్మిట్ చేసుకునేప్పుడు మహిళా ఖైదీని లేడి డాక్టర్ పరీక్ష చేయాలి. మహిళా ఉద్యోగి శారీరక తనిఖీ జరపాలి. ఆమె గర్భవతి అని తెలితే సరైన గైనకాలజికల్ పరీక్షలు నిర్వహించాలి, ఆమెకు తగిన ప్రీ – నాటల్, పోస్ట్ – నాటల్ చికిత్స అందించాలి. ఆమెకు ప్రత్యేక ఆహారం ఇవ్వాలి.

సి). స్త్రీ ఆరోగ్యానికి వ్యక్తిగత శుభ్రత, హైజీన్ కీలకం కాబట్టి వారికి అవసరమైన ప్రైవసీ. సెల్ఫ్ – హైజీన్ జైలులో కల్పించాలి.

**2. ఖైదీల పిల్లలు :**

ఏ). జైలులో శిశు జననం జరిగితే తప్పక స్థానిక జనన రిజిస్ట్రేషన్ ఆఫీసులో నమోదు చేయాలి, అయితే శిశువు జైలులో పుట్టిన విషయం పేర్కొన కూడదు.

బి). ఆరేళ్ళ వయసు వచ్చేంత వరకు పిల్లలు తల్లితో కలసి జైలులోనే వుండవచ్చు (అరుదైన కేసుల్లో తండ్రితో కలసి వుంటారు) – ఆ తర్వాత వాళ్ళను ఖైదీ కుటుంబానికి, లేదా (కుటుంబీకులు,ఇతర ఆశ్రయం లేని పక్షంలో) షెల్టర్ హోమ్‌కి అప్పగిస్తారు.

సి). జైలులో పెరిగే పిల్లలకు స్థానిక వాతావరణానికి తగిన దుస్తులు ఇవ్వాలి, వారి వయసుకు తగ్గ పోషకాహారం అందించాలి. పోలియో చుక్కలు సహా సకల వ్యాధి నిరోధక వ్యాక్సిన్లు ఇప్పించాలి.

డి). ఖైదీల పిల్లలకు సరైన చదువులు, వినోద అవకాశాలు అందించాలి. వారి తల్లులు జైలు లోపల పని చేస్తున్న సమయంలో పిల్లలను మాట్రాన్ లేదా ఫిమేల్ వార్డెన్ పర్యవేక్షణలో క్రెష్/నర్సరీ స్కూల్‌లో ఉంచాలి.

**3. బాల /యువ నేరస్థులు**

ఏ). 18 –21 ఏళ్ళు న్న బాల నేరస్థులను వేరుగా ఉంచాలి, వారిని ఇతర ఖైదీలతో కలప కూడదు.

బి). 18 ఏళ్ల లోపు వారిని జైలులో పెట్టకూడదు. 18 ఏళ్ల లోపు వారి కేసును లీగల్ సర్వీసెస్ అథారిటీకి, సంబంధిత కోర్టుకి తెలియ జేసి, పరిశీలన కోసం వెంటనే చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగించాలి.

సి). వారి పోషణకు అవసరమైన సమ తుల్యాహారం అందించాలి.

డి). బాల నేరస్థుల చదువు అవసరాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. వారికి వ్యాయామ, ఆరోగ్య విద్యలతో పాటు వొకేషనల్ శిక్షణ, హస్తకళల శిక్షణ, ఇతర కళా నైపుణ్యాలు నేర్పించాలి.

**4. విదేశీ ఖైదీలు**

ఏ). విదేశీ ఖైదీలను జైలులో అడ్మిట్ చేసిన వెంటనే వాళ్ళ పౌరులను నిర్బంధంలోకి తీసుకున్నట్టు ఆ దేశ దౌత్య కార్యాలయానికి జైలు సూపరింటెండెంట్ సమాచారమివ్వాలి.

బి). జైలులో ప్రవేశించిన తర్వాత వాళ్ళు తమ కాన్సులేట్ అధికారులతో మాట్లాడే సౌకర్యం కల్పించాలి. జాప్యం లేకుండా కాన్సులేట్‌కు (అనుమతించిన సెన్సార్ షిప్‌తో) సమాచారమందేలా చూడాలి.

సి). తమ దేశంలోని కుటుంబ సభ్యులకు, బంధువులకు ఉత్తరాలు రాసేందుకు వీలుగా పోస్టేజి కొనడానికి వాళ్ళను అనుమతించాలి. వాళ్ళ వద్ద డబ్బు లేకపోతే పోస్టేజి స్టాంపులను జైలు అధికారులు సమకూర్చాలి.

డి). విదేశీ ఖైదీలు తమ కుటుంబ సభ్యులతో మాట్లాడేందుకు వీలుగా, సెక్యూరిటీ నియమాలు అనుమతించిన మేరకు, వీడియో కాన్ఫరెన్సింగ్, ఈ మెయిల్ సౌకర్యాలు వాడుకోనివ్వాలి.

ఇ). విదేశీ ఖైదీలను జైలులో చేర్చుకున్న వెంటనే వారి జాతీయతను గుర్తించే ప్రక్రియ మొదలవ్వాలి.

## 5. మనో వైకల్యం గల, లేదా దివ్యాంగ ఖైదీలు

ఏ). ఏ రకంగానూ దివ్యాంగులైన ఖైదీలు మిగతా ఖైదీల లాగే సౌకర్యాలు, కార్యక్రమాలు, సేవల విషయంలో సమాన హక్కు కలిగి వున్నారు.

బి). వినికిడి లోపం గల ఖైదీలకు డిసిప్లినరి హియరింగ్, క్లాసిఫికేషన్ హియరింగ్ సమయాల్లో, వొకేషనల్, ఎడ్యుకేషనల్ కార్యక్రమాల సందర్భాల్లో సైన్ లాంగ్వేజ్ అనువాదకుల సాయం అందుబాటులో ఉంచాలి.

సి ). మానసిక వికలాంగులకు సరైన చికిత్స అందించాలి, వారి నిరవధిక డిటెన్షన్ నిరోధించేందుకు వారి కేసులను అప్పుడప్పుడు సమీక్షించాలి.

## 6. మరణ శిక్ష పడ్డ ఖైదీలు

ఏ). ఒక అధికారి సమక్షంలో వారు తమ కుటుంబ సభ్యులను, బంధుమిత్రులను, లాయర్‌లను వారానికొక సారి కలిసి మాట్లాడే అవకాశమివ్వాలి.

బి). వారు నమ్మిన మతానికి చెందిన ప్రీస్ట్ /మతాచార్యుడు వారిని కలిసేందుకు అనుమతించాలి.

సి). మత సంబంధ పుస్తకాలు, పటాలు, గుర్తులు, పేపర్‌లు వారికి అందించవచ్చు.

డి). మరణ శిక్ష ఖైదీలను వేరే సెల్‌లో పెట్టి. రాత్రింబవళ్ళు ఒక గార్డును కాపలా ఉంచాలి.

# నేర విచారణలో దశలు

**88. విచారణ అంటే ఏమిటి ?**

కేసుకు సంబంధించిన వాస్తవాలు, సాక్ష్యాధారాలను పరిశీలించే ప్రక్రియే విచారణ. ప్రాసిక్యూషన్ వారు, డిఫెన్స్ లాయర్లు వాద ,ప్రతివాదాలు వినిపిస్తారు .వీటి ఆధారంగా జడ్జి ఒక నిర్ణయం తీసుకుంటాడు .

**89. విచారణలో వివిధ దశలు ఏవి ?**

**1**

**అరెస్ట్**

అతడు /ఆమె నేరం చేశారనడానికి ,లేదా నేరం చేయబోతున్నారనడానికి సరైన ఆధారాలుంటే ఆ వ్యక్తిని అరెస్ట్ చేయ వచ్చు. వ్యక్తిని అరెస్ట్ చేశాక పోలీస్ స్టేషన్‌కు తరలిస్తారు. ఒక వేళ అది బెయిలేబుల్ నేరమయితే అతనికి /ఆమెకు పోలీస్ స్టేషన్ లోనే బెయిల్ ఇవ్వొచ్చు.

**2**

**హాజరు పరచడం**

అరెస్టయిన 24 గంటలలోగా వ్యక్తిని పోలీసులు మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచాలి. దర్యాప్తు పేపర్ లను పోలీసులు కోర్టులో సమర్పిస్తారు. దర్యాప్తు కొనసాగించేందుకు పోలీసులు అరెస్టయిన వ్యక్తిని మరికొంత కాలం కస్టడీలో ఉంచుకునేందుకు కోర్టును అనుమతి కోరవచ్చు. డాక్యుమెంటులను పరిశీలించిన మీదట మేజిస్ట్రేట్ అతడిని /ఆమెను పోలీస్ స్టేషన్(కస్టడీ)కు పంపవచ్చు లేదా జైలు (జుడిషియల్ కస్టడీ)కు పంపవచ్చు లేదా బెయిల్ మంజూరు చేయవచ్చు, లేదా ఆరోపణలు కొట్టి వేసి అతని /ఆమె విడుదలకు ఉత్తర్వు జారీ చేయవచ్చు.

**3**

**చార్జ్ (ఆరోపణ)**

అతడు /ఆమె నేరం చేశారని ఆరోపించే లాంచనమైన నోటీసు 'చార్జ్'. దర్యాప్తు ముగించిన తర్వాత పోలీసులు కోర్టులో చార్జ్ షీటుని దాఖలు చేస్తారు. చార్జ్ షీటుని పరిశీలించాక కోర్టు, ఆరోపణకు స్పష్టత నిస్తూ అతనికి/ఆమెకు చదివి వినిపించడం జరుగుతుంది. ఆరోపణ పత్రంలో పేర్కొన్నట్టుగా తాను నేరం చేసిందీ లేనిదీ (గిల్టీ ఆర్ నాట్ గిల్టీ) అతడు/ఆమె కోర్టులో చెప్పుకోవచ్చు.

**4**

**విచారణ**

తానే నేరం చేయలేదని అతడు/ఆమె వాదిస్తే కేసుని విచారణకి పెడతారు. విచారణలో ఈ కింది దశలుంటాయి :

* సెక్షన్ 313 ఆఫ్ సి ఆర్ పీసీ కింద నిందితుని వాంగ్మూలం
* మౌఖిక, రాత పూర్వక సాక్ష్యాధారాలు
* ప్రాసేక్యూషన్,డిఫెన్స్ లాయర్ల చేత వాద, ప్రతివాదాలు
* తీర్పు ప్రకటన.

**5**

**శిక్ష విధింపు లేదా కొట్టివేత**

కేసు విచారణ పూర్తయినతర్వాత కోర్టు అతడు /ఆమెని నిర్దోషిగా తేల్చి కేసు కొట్టి వేస్తూ వ్యక్తి (కస్టడి లేదా జైలులో వుంటే)ని విడుదల చేయాల్సిందిగా ఆదేశమిస్తుంది, లేదా దోషిగా తేల్చి సరైన శిక్ష విధిస్తుంది.

**6**

**అప్పీల్**

తీర్పు బాధితుడైన వ్యక్తి నిర్దేశిత గడువు లోపల కేసుకొట్టివేత / వేరే శిక్ష/శిక్షా కాలం తగ్గింపు కోరుతూ అప్పీల్ చేసుకోవచ్చు. అప్పీల్‌పై విచారణ పెండింగ్ పెడుతూ అప్పెలేట్ కోర్టు అతని /ఆమె శిక్షను నిలుపు చేయవచ్చు.

**90. కేసు విచారణ తేదీన ఖైదీలను కోర్టులో ఎవరు హాజరు పరుస్తారు ?**

కేసు విచారణ తేదీన ప్రతి ఖైదీ తప్పని సరిగా కోర్టులో హాజరు కావాలి. ప్రొడక్షన్ హియరింగ్ (చార్జ్ షీట్ ఫైల్ చేయడానికి ముందు) కొరకు, ఖైదీ వివిధ పద్ధతుల్లో కోర్టు ముందు హాజరు అయేందుకు అనుమతిస్తారు.

## జైలులో వీడియో కాన్ఫరెన్సింగ్ సౌకర్యం

విచారణ కోసం నిందితులు ప్రత్యక్షంగా కోర్టులో హాజరు అవాలన్నఆదేశం వున్నప్పుడు ఖైదీలను కోర్టుకి, కోర్టు నుంచి బయటకు తీసుకు వెళ్ళే బాధ్యత పోలీసులదే. ఖైదీలను కోర్టుకి తరలించేందుకు ఎంత మంది పోలీసుగార్డులు అవసరమో జైలు అడ్మినిస్ట్రేషన్ ముందుగా విజ్ఞప్తి చేసుకోవాలి.

**91. ఎస్కార్ట్ సిబ్బంది కొరత వల్ల గానీ, మరో కారణం వల్ల గానీ విచారణ తేదీనాడు ఖైదీని కోర్టులో హాజరు పరచలేని సందర్భంలో ఖైదీ ఏం చేయాలి ? తనను కోర్టు వరకు తీసుకుపోయి, కోర్టు లాకప్‌లోనే పెట్టి మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచక పోతే ఖైదీ ఏం చేయాలి ? వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా మాత్రమే తమని ప్రవేశపెట్టి జుడిషియల్ ఆఫీసర్‌తో నేరుగా మాట్లాడే అవకాశం ఇవ్వనప్పుడు ఖైదీలు ఏమి చెయ్యాలి ?**

అలాంటి పరిస్థితుల్లో, తమని కోర్టులో హాజరు పరచడం లేదన్న విషయాన్ని ఖైదీలు తమ లాయర్ల ద్వారా గానీ, లీగల్ ఎయిడ్ క్లినిక్ మెంబర్‌ల ద్వారా గానీ పిటీషన్ వేసి కోర్టు దృష్టికి తీసుకువస్తూ, తమని వెంటనే కోర్టులో హాజరు పరచే ఏర్పాట్లు చేయమని విజ్ఞప్తి పెట్టుకోవాలి.

**92. కాగ్నిజిబుల్, నాన్ - కాగ్నిజిబుల్ నేరాలంటే ఏమిటి ?**

అరెస్ట్ వారంట్ అవసరం లేకుండా ఒక పోలీస్ ఆఫీసర్ అనుమానితుడిని అరెస్ట్ చేయ గలిగేది కాగ్నిజిబుల్ నేరం. ఖూని, లైంగిక అత్యాచారం, కిడ్నాపింగ్... వగైరా ఈ కోవలోకి వస్తాయి. నాన్ - కాగ్నిజిబుల్ నేరం అంటే వారంట్ లేకుండా పోలీస్ ఆఫీసర్ నిందితుణ్ణి అరెస్ట్ చేయలేనిది. ఇవి అంత సీరియస్ కాని నేరాలు. దాడి, మోసం, నమ్మక ద్రోహం... ఈ కోవకి చెందుతాయి. నాన్ - కాగ్నిజిబుల్ నేరం కేసులో దర్యాప్తు ఆరంభించాలంటే పోలీస్ ఆఫీసర్ మేజిస్ట్రేట్ నుంచి ముందుగా అనుమతి తీసుకోవాలి.

**93. బెయిలేబుల్, నాన్ - బెయిలేబుల్ నేరాలంటే ఏమిటి ?**

CrPC ప్రకారం నేరాల్ని బెయిలేబుల్, నాన్ - బెయిలేబుల్ నేరాలుగా వర్గీకరించారు. మొదటివి రెండో వాటి కన్నా స్వభావ రీత్యా తక్కువ సీరియస్‌వి. నాన్ - బెయిలేబుల్ నేరారోపణ ఉన్నప్పటికీ నిందితునికి బెయిల్ ఇవ్వొచ్చు - అయితే ఇది కోర్టు విచక్షణపై ఆధారపడి వుంది. బెయిలేబుల్ కేసులో వ్యక్తిగత పూచికత్తు (బాండ్) లేదా హామీ (ష్యూరిటి) మీద బయటకు వచ్చే హక్కు నిందితునికి వుంది.

**94. బెయిల్ అంటే ఏమిటి ? ష్యూరిటీలు, బాండ్లు ఏమిటి ?**

విచారణకై ఎదురుచూస్తూ ఖైదీ తాత్కాలికంగా విడుదల కావడమే బెయిల్. బెయిల్ కొన్ని షరతుల మీద ఇవ్వొచ్చు, షరతులు లేకుండా ఇవ్వొచ్చు. బెయిల్ మీద రిలీజ్ అయినా, వ్యక్తిగత హామీ మీద రిలీజయినా, కోర్టు నిర్దేశించిన నగదు మొత్తానికి వ్యక్తి బాండ్ సమర్పించవలసి వుంటుంది. బాండ్‌లో పేర్కొన్న స్థలానికి, సమయానికి

హాజరవుతాననీ, కోర్టు మరో విధంగా ఆదేశించేంతవరకు హాజరవుతూనే ఉంటాననీ, ఒకటి లేదా అంతకు మించి సరిపడే స్యూరిటీలు సమర్పించాకే వ్యక్తి బెయిల్ మీద విడుదలవుతాడు. మరొకరి బాకీకి లేదా డిఫాల్ట్‌కి తాను జవాబు దారునంటూ ఒకరు వాగ్దానమివ్వడమే స్యూరిటీ. వ్యక్తిగత బాండ్ ఒక రాతపూర్వక ఒప్పందం, ఫలానా విధులు/పనులు నిర్వర్తిస్తాననీ/చేయననీ వ్యక్తి అందులో వాగ్దానం చేస్తాడు. వాగ్దానభంగం జరిగితే అపరాధ రుసుముగా డబ్బు కట్టాల్సి వుంటుంది.

## 95. బెయిల్ మొత్తం చెల్లించని /స్యూరిటి ఇవ్వని ఖైదీల విషయంలో ఏం జరుగుతుంది?

బెయిలేబుల్ కేసుల్లో. నిందితుడు బెయిల్ బాండ్ చెల్లించలేక పోతే ,లేదా స్యూరిటి ఇవ్వక పోతే, అప్పటికే అతడు /ఆమె డిటెన్షన్‌లో ఏడు రోజులు గడిపివుంటే – ఆ వ్యక్తిని నిరుపేదగా ప్రకటించి వ్యక్తిగత పూచికత్తు పై వెంటనే రిలీజ్ చేయాలి. నాన్ – బెయిలేబుల్ కేసుల్లో బెయిల్ నగదు మొత్తాన్ని తగ్గించాల్సిందిగా లాయర్ కోర్టుకు విన్నపం పెట్టుకో వచ్చు. నిందితునికి లాయర్ లేని పక్షంలో సాయం కోసం ప్రిజన్ లీగల్ సర్వీసెస్ క్లినిక్‌ను అడగాలి. ఇలాంటి కేసులన్నీ UTRC ల చేత సమీక్షకు అర్హమైనవి.

## 96. బెయిల్ షరతులకు ఖైదీ కట్టుబడక పోతే ఏం జరుగుతుంది ?

తగిన కారణాలు లేకుండా కోర్టు విచారణకు గైర్హాజరు కావడం 'బెయిల్ జంప్' కిందకు వస్తుంది. విడుదల షరతుల్లో దేనిని ఉల్లంఘించినా నిందితుణ్ణి మళ్ళా అరెస్ట్ చేయవచ్చు, బెయిల్ నగదు మొత్తాన్ని అతని నుండి లేదా స్యూరిటి నుండి వసూలు చేయవచ్చు.

## 97. ఎట్టి పరిస్థితులలోనైనా బెయిల్ మంజూరు చేయడం హక్కు కిందకు వస్తుందా ?

ఔను. నిర్దిష్ట పరిస్థితుల్లో ఖైదీ చట్ట బద్ధంగా బెయిల్‌కు అర్హుడు. CrPC ప్రకారం: ఎ). బెయిలేబుల్ కేసుల్లో వ్యక్తిని పోలీస్ ఆఫీసర్ లేదా మేజిస్ట్రేట్ బెయిల్‌పై విడుదల చేయాలి (సెక్షన్ 436 ఆఫ్ CrPC). బి). వివిధ నేరాల గురించి పోలీసులు నిర్దేశిత గడువు లోగా దర్యాప్తు ముగించి చార్జ్ షీట్ ఫైల్ చేయక పోతే నిందితుణ్ణి బెయిల్ పై విడుదల చేయాల్సిందే( సెక్షన్ 167(2) ఆఫ్ CrPC). సి). తీర్పు ద్వారా ఎంత శిక్షా కాలం విధించ బడివుండేదో అందులో గరిష్టభాగం ఖైదీ అప్పటికే గడిపివుంటే అతణ్ణి బెయిల్‌పై రిలీజ్ చేయాలి (సెక్షన్ 436 ఎ ఆఫ్ CrPC). డి). తీర్పుద్వారా గరిష్టంగా ఎంత శిక్షా కాలం విధించబడివుండేదో అందులో మొదటి సగ భాగం ఖైదీ గడిపివుంటే అతణ్ణి బెయిల్‌పై రిలీజ్ చేయాలి (సెక్షన్ 436 ఎ ఆఫ్ CrPC).

## 98. శిక్షపై తీర్పువెలువడిన తర్వాత ఏం జరుగుతుంది ?

ఖైదీ దోషి అని కోర్టు తెల్చితే, ఖైదీకి శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు వెలువరిస్తాడు. శిక్ష – 'మందలింపు' లేదా 'సత్ప్రవర్తన పరివీక్షణ (ప్రొబేషన్ ఆఫ్ గుడ్ కాండక్ట్)' లేదా జరిమానా, లేదా జరిమానాతో కూడిన జైలు శిక్ష, లేదా మరణ దండన (ఇది హైకోర్ట్ ధృవీకరించాలి) రూపంలో వుంటుంది. ఖైదీకి నిర్దిష్ట కాలపు కారాగారవాసం విధించినప్పుడు అతను శిక్ష పడ్డ ఖైదీ (Convict) గా పరిగణించబడతాడు. అతను నిర్దోషి అని కోర్టు భావిస్తే అతడు వెంటనే విడుదలవుతాడు, బెయిల్ హామీలు, స్యూరిటీలు రద్దవుతాయి.

**99. తీర్పును వ్యతిరేకిస్తూ వ్యక్తి ఎలా అప్పీల్ చేసుకోవచ్చు ?**

తీర్పు వెలువడిన నిర్ణీత గడువులోగా అప్పీల్ చేసుకునే హక్కు ప్రతి వ్యక్తికీ వుంది. అయితే నేరం చేసినట్టు కోర్టులో స్వయంగా ఒప్పుకున్న ఖైదీల దరఖాస్తు ఆధారంగా అప్పీల్ చేసే అవకాశం లేదు. అప్పీల్ పై నిర్ణయాన్ని పెండింగ్‌లో ఉంచుతూ వ్యక్తిని తాత్కాలికంగా విడుదల చేయవచ్చు, దీనిని 'సస్పెన్షన్ ఆఫ్ సెంటెన్స్' లేదా బెయిల్ అని సాధారణంగా అంటారు.

**100. లాయర్‌ని పెట్టుకునే స్తోమత లేని ఖైదీలు అప్పీల్ చేసుకోవడమెలా ?**

అప్పీల్ ఫైల్ చేసేందుకు లాయర్‌ని పెట్టుకోలేని కుటుంబానికి చెందిన ఖైదీ– హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీకి, లేదా సుప్రీమ్ కోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీకి నేరుగా కానీ ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా కానీ దరఖాస్తు పెట్టుకుని తనకో లాయర్‌ని నియమించమనీ, అప్పీల్ ఫైల్ చేయమనీ కోరాలి.

**101. ఖైదీ లేక అతని కుటుంబం తమ కేసు విచారణ ఏ దశలో వుందో తెలుసుకోవడమెలా? నిర్బంధంలో వున్నప్పుడు అప్పీల్ చేసుకోవడమెలా?**

తన కేసు విచారణ దశ గురించి ఎప్పటికప్పుడు లాయర్ ద్వారా తెలుసుకోవడంతో పాటు ఖైదీ, ఇ–కోర్ట్స్ వెబ్‌సైట్ (www.ecourts.gov.in/ecourts-home)ని సంప్రదించి ఏ కేసు విచారణ గురించయినా, అప్పీల్ గురించైనా తెలుసుకోవచ్చు. ఈ పోర్టల్ ద్వారా జిల్లా కోర్టు, హై కోర్టు లేదా సుప్రీం కోర్టులోని ఏ కేసు గురించైనా తెలుసుకునే వీలుంది. ఈ వెబ్‌సైట్‌ని చేరుకోవడానికి లీగల్ ఎయిడ్ అథారిటీల, జైలు ఉద్యోగుల, పారా లీగల్ వాలంటీర్ల, లేదా ఇతరుల సాయం కోరవచ్చు. సంబంధిత కోర్టు లీగల్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫీసును సందర్శించి తమ కేసు తాజా పరిస్థితి గురించి వ్యక్తులు తెలుసుకోవచ్చు.

# ఖైదీల హక్కులు

నిర్బంధంలో వున్నప్పుడు నియంత్రించిన కొన్ని మినహా, ఖైదీలకు భారత రాజ్యాంగం హామీ ఇచ్చిన అన్ని ప్రాథమిక హక్కులు వర్తిస్తాయి. కింద ఇచ్చిన హక్కులు, విధులు అవే సమస్తమని కాదు.

**మానవ గౌరవ హక్కు:**

- మానవ ప్రాథమిక గౌరవానికి భంగం వాటిల్ల కుండా తన శారీరక, మానసిక స్వేచ్ఛను కాపాడుకునే హక్కు.
- చిత్ర హింస, క్రూరత్వం, అమానుషమైన వేధింపు, దుర్నీతి పూర్వకమైన అణచివేతల నుంచి కాపాడుకునే హక్కు.
- చట్టానికి లోబడిన నియంత్రణ లకు తలవంచుతూనే తన ప్రాథమిక హక్కులను అనుభవించే హక్కు.
- గొలుసులతో, సంకెళ్ళతో బందీ కావడాన్ని నిరాకరించే హక్కు.
- ఖైదు లోకి వచ్చేటప్పుడు వైద్య పరీక్ష కోరుకునే హక్కు.
- అన్యాయమైన వివక్షను వ్యతిరేకించే హక్కు.
- మానవ వ్యక్తిత్వ సంపూర్ణ వికాసం లక్ష్యంగా విద్యను పొందే, సాంస్కృతిక కార్య క్రమాల్లో పాల్గొనే హక్కు.
- కనీస ప్రాథమిక అవసరాలు పొందే హక్కు:
- ఖైదీలకు చట్టం అనుమతించిన సౌకర్యాలు, హక్కులు తెలుసుకోవాలని కోరే హక్కు.
- సురక్షిత మంచినీరు, చాలినంత తిండి, ఆరోగ్య సంరక్షణ పొందే హక్కు.
- వ్యక్తిగత పారిశుధ్య వసతి, శుభ్రమైన, ఆరోగ్య కరమైన జీవన పరిస్థితి పొందే హక్కు.
- సరైన దుస్తులు, పడక, ఇతర సౌకర్యాలు పొందే హక్కు.
- బాధలు, సమస్యలు వ్యక్తీకరించే హక్కు.
- నిర్దేశిత నియమానుసారం జైలులో ఖైదీ చేసిన పనికి సరైన వేతనం పొందే హక్కు.
- జైలు, ఖైదీల భద్రతకు విఘాతం కలగని రీతిలో తన మతవిశ్వాసాలను ఆచరించే హక్కు.
- పెరోల్, ఫర్లాఫ్ కోరే హక్కు.

**కమ్యూనికేషన్ చేసుకునే హక్కు:**

- బయటి ప్రపంచంతో భావప్రసారం జరిపే హక్కుబీకుటుంబసభ్యులతో, మిత్రులతో, లాయర్‌లతో అప్పుడప్పుడు భేటీ జరిపే హక్కు.
- తను ఖైదు చేయబడ్డ సంగతి, తన అనారోగ్యం లేదా గాయం సంగతి కుటుంబ సభ్యులకు, మిత్రులకు తెలియ జేసే హక్కు, వేరే జైలుకు బదిలీ కోరే హక్కు.
- విదేశీ ఖైదీలు తమ రాయబార /కాన్సులేట్ /డిప్లోమేటిక్ కార్యాలయాలతో కమ్యూనికేషన్ జరిపి తమ డిటెన్షన్ గురించి తెలియజేసి న్యాయ సలహా, బదిలీ కోరే హక్కు.
- జైలు లైబ్రరీ లోకి వెళ్లి వార్తా పత్రికలు, పుస్తకాలు, మాగజైన్లు చదువుతూ బయటి ప్రపంచం తో సంపర్కం పెట్టుకునే హక్కు.

**జైలులోని మహిళా ఖైదీల, పిల్లల హక్కులు:**

- పురుష ఖైదీల నుండి దూరం గా బందీగా వుండే హక్కు.
- తమ పిల్లలను ఆరేళ్ళ వయసు వచ్చే వరకు తమతోనే ఉంచుకునే మహిళా ఖైదీల హక్కు.
- మహిళా గార్డులతోనే శారీరక తనిఖీ,పర్యవేక్షణ కోరుకునే హక్కు.
- గర్భిణీలైన మహిళా ఖైదీలు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో గైనోకాలజికల్ చెకప్ కోరుకునే హక్కు.
- ప్రసవానికి కనీస ప్రాథమిక వసతి, జైలులో ప్రీ - నాటల్, పోస్ట్ - నాటల్ సంరక్షణ కోరుకునే హక్కు.
- శిశు జన్మ స్థానం జైలు అని జన్మ ధృవీకరణ పత్రంలో నమోదు కావడాన్ని నిరాకరించే హక్కు.
- కూడు, గుడ్డ, గూడు, చదువు, వినోద సౌకర్యాలకు పిల్లలకున్న హక్కు.
- క్రమానుగత వాక్సినేషన్ ,లేడీ డాక్టర్‌చే చెకప్ కోరుకునే పిల్లల హక్కు.
- జైలు ఆవరణలో క్రెచ్, నర్సరీ కావాలనే పిల్లల హక్కు.

**ఖైదీల విధులు:**

- జైలు నియమ నిబంధనలు, చట్టాలు,జైలు అధికారుల ఆదేశాలు పాటించాలి.
- జైలులో శాంతి భద్రతలు,క్రమశిక్షణ అమలు చేయడంలో అధికారుల విదినిర్వహణకు సహకరించాలి.
- జైలులో క్రమశిక్షణా యుతమైన జీవితం గడుపుతూ ప్రాంగణం లో పరిశుభ్రతా ప్రమాణాలు పాటించాలి.
- జైలులో ఏదైనా అవాంచనీయ ఘటన, చర్య జరిగితే వెంటనే జైలు అధికారులకు తెలియ పరచాలి.
- ఫిర్యాదుల స్వీకరణ యంత్రాంగాన్ని ఉపయోగించుకోవాలి, తోటి వాళ్లకు అదే సలహా ఇవ్వాలి. అయితే తప్పుడు ఫిర్యాదులు, కుట్రలు, ఆందోళనలు జైలులో చేయకుండా వుండాలి.
- పెరోల్ లేదా ఫర్లాఫ్ గడువు ముగియగానే జైలుకు తిరిగి వచ్చేయాలి.
- నిషేధిత వస్తువులు జైలులోకి తీసుకురాకూడదు.
- జైలు తలుపులు, కిటికీలు, తాళాలు లేదా జైలుకు చెందిన ఏ సామగ్రినీ ధ్వంసం చేయకూడదు, ప్రభుత్వ ఆస్తిని జాగ్రత్తగా వాడాలి.
- జైలులోని సంస్కరణా యుతమైన వాతావరణాన్ని కాపాడండి, ప్రోత్సహించండి.
- శిక్ష పడ్డ ఖైదీలు తమ లేబర్ డ్యూటీలను విధిగా చేయాలి.
- తోటి ఖైదీల, జైలు ఉద్యోగుల, ఇతరుల జీవించే హక్కును, హోదాను గౌరవించండి.
- ఇతర ఖైదీల మతవిశ్వాసాలను కించపరచకుండా ఉండాలి.

## CHRI కార్యక్రమాలు

జవాబుదారీ తనం, భాగస్వామ్యాల విషయమై కామన్వెల్త్, దాని సభ్యదేశాలు ఉన్నత ప్రమాణాలు, కార్యాచరణ యంత్రాంగాలకు కట్టుబడివుండాలని CHRI విశ్వసిస్తుంది. మానవ హక్కులకు, పారదర్శక ప్రజాస్వామ్యాలకు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (SDGs) కు ఇది అత్యవసరం. మానవ హక్కుల ప్రచారం, న్యాయం అందుబాటు, సమాచార అందుబాటులపై ప్రత్యేక దృష్టి వుంచి వ్యూహాత్మక కార్యకలాపాలతో CHRI కృషి చేస్తుంది. పరిశోధన, ప్రచురణలు, కార్యశాలలు, విశ్లేషణ, ప్రజా చైతన్యం, భావ వ్యాప్తి, ఉద్బోధలు లక్ష్యంగా CHRI ముఖ్యంగా ఈ దిగువ కార్యక్రమాలను చేపడుతుంది :

### 1. న్యాయం అందుబాటు (Access to Justice - ATJ)

* పోలీస్ సంస్కరణలు : పోలీస్ వ్యవస్థ పౌరుల హక్కులను రక్షించే బదులు రాజ్యం యొక్క అణచివేత పరికరంలాగే వ్యవహరిస్తూ మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతూ న్యాయాన్ని ధిక్కరిస్తున్నదనే అభిప్రాయం చాలా దేశాల్లో వుంది. పాలక వర్గాల కొమ్ము కాసే బదులు పోలీసులు చట్టబద్ధ పాలనకు తోడ్పడే వారుగా పరివర్తన చెందడానికి వ్యవస్థా పరమైన సంస్కరణలను CHRI ప్రోత్సహిస్తుంది. పోలీస్ సంస్కరణలకు ప్రజా మద్దతు కూడగట్టి, ఈ విషయంలో పౌర సమాజపు భాగ స్వామ్యాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా CHRI కార్యకలాపాలు వుంటాయి. తూర్పు ఆఫ్రికాలో, ఘనాలో పోలీస్ జవాబుదారీ తనాన్ని, రాజకీయ జోక్యాన్ని CHRI పరిశీలిస్తున్నది.
* రంగు, రూపం, జెండర్ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా ఒక పోర్టుఫోలియో జత చేసేందుకు సంసిద్ధమవుతున్నాము.
* జైలు సంస్కరణలు: విషయాలు బయటికి రాని చీకటి శాఖలో పారదర్శకత పెంచి, అవకతవకల్ని బహిర్గతం చేసే లక్ష్యంతో CHRI జైళ్ళపై తన నిశిత దృష్టి సారిస్తుంది. క్రిక్కిరిసి పోయే జైళ్ళు, కాలావధి మించే డిటెన్షన్‌లు, విచారణ కోసం అంతులేని నిరీక్షణ, వీటన్నింటికీ కారణమైన న్యాయ వ్యవస్థ వైఫల్యం... CHRI ఇవన్నీ ఎత్తి చూపడమే కాకుండా లీగల్ ఎయిడ్ అందుబాటుకు మార్గాలు, జైలు పర్యవేక్షణ వ్యవస్థను పటిష్టం చేసే మార్పులు సూచించే పనిలో నిరంతరం నిమగ్నమై వుంది. ఇవి జైళ్ళలో పరిస్థితులను, ఖైదీలకు న్యాయ సాయం అందే అవకాశాలను మెరుగు పరచడానికి తప్పక తోడ్పడతాయి.

### 2. సమాచార అందుబాటు (Access to Information)

సమాచార అందుబాటుని ప్రోత్సహించే పలు సంస్థలలోకెల్లా CHRI అతి కీలకమైనది. సమాచార హక్కుకి సంబంధించి పటిష్టమైన చట్టాలు రూపొందించాల్సిందిగా ఇది అన్ని దేశాలను ప్రోత్సహిస్తుంది. శాసనాల రూపకల్పనకు ఇది సాయపడుతుంది; ఇండియా, శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, ఘనాలలో, ఇటీవలి కాలంలో కెన్యాలో – సమాచార హక్కు, దాని అమలుకు సంబంధించిన చట్టాల తయారీని ప్రోత్సహించడంలో విజయ వంతమైంది. ఘనాలో 'ఆర్ టీ ఐ-సివిల్ సొసైటీ కోలియేషన్' కు CHRI సెక్రటేరియట్‌గా వ్యవహరిస్తున్నది. కొత్తచట్టాలను ప్రభుత్వాలు రూపొందించే సమయంలోనూ, వాటిని మొదటిసారి అమలు పరిచే సమయంలోనూ విమర్శ లేవనెత్తి వాటిని ప్రజా హితమైన ఉత్తమ చట్టాలుగా తీర్చి దిద్దాల్సిందిగా ఉద్బోధించేది మేమే.ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో, వైవిధ్య భరితమైన సాంస్కృతిక పరిధులలో పని చేసిన అనుభవం మాకున్నది. సమాచార హక్కుపై కొత్త చట్టాలకు పూనుకునే దేశాలకు విలువైన సూచనలివ్వగల అనుభవం ఇది. ఉదాహరణకు – సమాచార అందుబాటుకు సంబంధించి పటిష్టమైన చట్టాలు రూపొందించమని చెప్పి ఘనాలో సఫలీకృతుల మయాం.

### * సౌత్ ఆసియా మీడియా డిఫెండర్స్ నెట్ వర్క్ (SAMDEN)

దక్షిణాఫ్రికాలో, ప్రత్యేకించి అక్కడి గ్రామీణ ప్రాంతాల్లో మీడియా వర్కర్ల మీద దాడులు, భావ ప్రకటన స్వేచ్ఛపై ఒత్తిళ్ళు పెరుగుతున్న నేపథ్యంలో పరిస్థితుల్ని చక్క దిద్దడం లక్ష్యంగా మీడియా ప్రొఫెషనల్స్ కోసం ఒక ప్రాంతీయ నెట్ వర్క్‌ని CHRI రూపొందించింది. రాజకీయాల సరిహద్దులు లేని స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అవసరమని SAMDEN గుర్తిస్తున్నది. వివక్ష, బెదిరింపులు అనుభవించిన మీడియా ప్రొఫెషనల్స్ ఆసరాతో, మీడియా పై ఒత్తిళ్లను, పత్రికా స్వేచ్ఛపై అణచివేతను ఎండగట్టేందుకు SAMDEN ఒక ఇంటరాక్టివ్ వెబ్‌సైట్ ప్లాట్ ఫారంని అభివృద్ధి చేసింది. సంఖ్యా బలంతో, సహకారంతో సామర్థ్యం పెంచే దిశగా మీడియాని చైతన్య వంతం చేయడానికి ఇది కృషి సలుపుతున్నది. సమాచార హక్కుల ఉద్యమాలు, కార్యకర్తలతో SAMDEN ని అనుసంధానం చేయడంలోనే సమ్మిళితశక్తి కేంద్ర స్థానం వుంది.

### 3. అంతర్జాతీయ ప్రచారం, అనుగుణమైన కార్యక్రమ రూపకల్పన

మానవ హక్కుల కర్తవ్యాలకు కట్టుబడి ఉండేలా కామన్వెల్త్ సభ్య దేశాలపై CHRI పర్యవేక్షణ చేస్తుంది, ఆ కర్తవ్యాలు ఉపేక్షకు గురైన సందర్భాల్లో మానవ హక్కుల ఆవశ్యకతను పునరుద్ఘాటిస్తుంది. కామన్ వెల్త్ సెక్రటేరియట్, మినిస్టేరియల్ ఏక్షన్ గ్రూప్, ఐక్యరాజ్య సమితి, ఆఫ్రికన్ కమిషన్ ఫర్ హ్యూమన్ అండ్ పీపుల్స్ రైట్స్... వంటి ప్రాంతీయ, అంతర్జాతీయ సంస్థలతో CHRI వ్యూహాత్మకంగా చేతులు కలుపుతుంది. కామన్వెల్త్ సంస్కరణలను పర్యవేక్షించడం, యు ఎన్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్‌లో కామన్వెల్త్ సభ్యదేశాలు చేసిన వాగ్దానాలను, యూనివర్సల్ పీరియాడిక్ రివ్యూని సమీక్షించడం... CHRI ప్రస్తుతం నిమగ్నమై వున్నవ్యూహాత్మక కార్యక్రమాలు. మానవహక్కుల మద్దతుదారులకు రక్షణ, పౌర సమాజ భావ వ్యక్తీకరణకు స్వేచ్ఛ కల్పించాలని మేము ఉద్ఘాటిస్తాం. కామన్వెల్త్‌లోని నేషనల్ హ్యూమన్ రైట్స్ ఇన్‌స్టిట్యూషన్‌ల పనితీరును నిశితంగా పరిశీలిస్తూ వాటిని ఇంకా బలోపేతం చేయాలని నొక్కి చెపుతాం.




అన్ని వేపులా మూసివుంచిన ప్రాంగణాలు జైళ్ళు. ఖైదీల రోజువారి జీవితం, వాళ్ళ దినచర్యల గురించిన సమాచారం మనకు దొరికేది చాలా స్వల్పం. అందులోనూ, జైలు జీవితం గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి గలవారు చాలా తక్కువ- ఒకసారి అందులోకి వెళితే తప్ప. దీనర్థం - కుతూహలం మూలంగా లేదా అవసరం కారణంగా చాలా మందిలో జైళ్ళ గురించి తలెత్తే ప్రశ్నలు సమాధానం లేకుండానే మిగిలి పోయాయి. జైళ్ళ గురించి, ఖైదీల జీవితాల గురించి తరచుగా అడిగే 101 ప్రశ్నలకు సమాధానాలు ఈ చిన్న పుస్తకంలో వున్నాయి.

డిజైన్ / లేఅవుట్ : సెంథిల్ (+91 75105 82104)
బొమ్మలు : అనిల్ ఊరుత్తంబళం
తెలుగు అనువాదం : ఆడెపు లక్ష్మీపతి

**Commonwealth Human Rights Initiative**
55A, Third Floor, Siddharth Chambers, Kalu Sarai
New Delhi 110 017, India
Tel: +91 11 4318 0200; Fax: +91 11 2686 4688
E-mail: info@humanrightsinitiative.org